



రా..దొ..రా..!

అనంతపురం క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జనావాసాల నడుమ వేశ్యాగృహాలను నిర్వహిస్తున్నారు. పొరుగువారికి ఏమాత్రం అనుమానం కలగకుండా దందా నడిపిస్తున్నారు. ఒకప్పుడు వేశ్యాగృహాలు ఊరికి దూరంగా ఉండేవి. ఇప్పుడు ట్రెండ్ మారింది. నిర్వాహకులు కొత్త ఎత్తులు వేస్తున్నారు. నివాస గృహాల మధ్య, ఖరీదైన ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. ఇంటిని అద్దెకు తీసుకుని, గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం చేయిస్తున్నారు. వారి గుట్టు రట్టయ్యేవరకు ఆ ప్రాంతంలో ఉంటున్న వారికి ఏమాత్రం తెలియడం లేదంటే.. వారి మెయింటెనెన్స్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులకు తెలియదా..? అంటే.. చెప్పలేం..! కొందరు పోలీసుల కనుసన్నల్లోనే ఈ దందా నడుస్తోందని ఆరోపణలు ఉండటమే దీనికి కారణం. మరికొందరికి తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

జనావాసాల నడుమ వ్యభిచారం

పొరుగువారికి తెలియకుండా దందా

రూ.వేలల్లో అద్దె చెల్లించి.. వ్యాపారం

అనంత, తాడిపత్రిలో అత్యధికంగా..

గుంతకల్లుకు గుంటూరు, బెజవాడ నుంచి..

విద్యార్థినులే టార్గెట్

అనంతపురం నగరంలో కొన్ని ప్రాంతాల్లో హైక్లాస్ వ్యభిచారం నడుస్తోంది. స్థానికంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఉంటున్న, చదువుతున్న యువతులను టార్గెట్ చేస్తున్నట్లు సమాచారం. ఆర్థిక పరిస్థితులు బాగోలేని అమ్మాయిలను ట్రాప్ చేసి, ఈ రొంపిలోకి దింపుతున్నట్లు తెలుస్తోంది. చాపకింద నీరులా అత్యంత రహస్యంగా ఈ వ్యవహారం సాగిపోతోంది. నగరంలోని కొన్ని ప్రాంతాలతోపాటు శివారులోని సిండికేట్‌నగర్‌లో నార్త్ ఇండియన్ వారైన ఉత్తరప్రదేశ్ ప్రాంతాల యువతులను పిలిపించి, విటులను ఆహ్వానిస్తున్నట్లు సమాచారం. గంటకు రూ.1500 నుంచి రూ.3వేల వరకు, రోజుకు రాత్రికి రూ.10వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నగర పరిధిలో అత్యధికంగా కళ్యాణదుర్గం బైపాస్, బళ్లారి బైపాస్‌లో ఉన్నట్లు సమాచారం. అశోక్‌నగర్‌లో ఓ స్కూల్ సమీపంలో దాదాపు నాలుగైదు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నారట. ఈ ఏరియాలోనే ఇలాంటి కేంద్రాలు ఐదారు వరకు ఉంటాయి. సోమనాథ్‌నగర్, ఆర్కేనగర్, హౌసింగ్‌బోర్డు, అరవిందనగర్, సున్నపుగేరు, వేణుగోపాల్ నగర్, శారదానగర్, రామ్‌నగర్ ఇలా అక్కడా.. ఇక్కడా.. అని కాదు ఎక్కడ పడితే అక్కడ వ్యభిచార గృహాలు ఏర్పాటవుతున్నాయి. తాడిపత్రి పట్టణంలోనూ కొన్ని ప్రాంతాల పరిధిలో ఇదే స్థాయిలో అద్దెలకు తీసుకుని, వ్యభిచార కేంద్రాలు నిర్వహిస్తున్నారు. అక్కడ ఫ్యామిలీ పేరుతో ఇల్లు తీసుకుంటారట. ఎవరైనా వస్తే బాబాయి, పిన్ని, అక్క కొడుకు, చెల్లెలి కూతురు అంటూ వరుసలు చెప్పి వ్యవహారాలు నడిపిస్తుంటారట.

హైక్లాస్ వ్యభిచారం

ఆ ఇల్లు డబుల్ బెడ్‌రూం. చూడటానికి చాలా క్లాస్‌గా కనిపిస్తుంది. అందులోనూ ఆ లోకేషన్ కూడా ప్రశాంత వాతావరణంలో ఉంటుంది. పై ఫ్లోర్‌లో యజమానులో, మరెవరో బాడుగకు ఉంటారు. ఆ రెండో ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుంటారు. అవసరమైతే త్రిబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా తీసుకుంటారు. పక్కా ఫ్యామిలీ ఇంటిలాగా మెయింటెన్ చేస్తారు. ఇంటి అద్దె రూ.15వేల నుంచి రూ.25వేల వరకు కూడా చెల్లించడానికి వెనుకాడరట. ఆ ఇంటిపై ఎవరి కన్నయినా పడితే... వెంటనే మకాం మార్చేస్తారని తెలుస్తోంది. సమీపంలోని ఇంట్లోకో, మరో కాలనీలోకో సెటప్ మార్చుతారని తెలిసింది.



దాడులు నామమాత్రమే..

జిల్లావ్యాప్తంగా పట్టణాల్లో వ్యభిచార కేంద్రాలు నిర్వహిస్తున్నా సమాచారం లేకనో...మనకెందుకనుకున్నారో పోలీసుల దాడులు తక్కువగానే జరిగాయి. ఏడాది మొత్తం వెతికినా అనంతపురం నగరంలో నాలుగైదుకు మించి పట్టిన దాఖలాల్లేవు. మిగిలిన ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి.

- గత ఏడాది అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిపై పోలీసులు రైడ్ చేశారు. ఆ భవనంలోని మరో ఫ్లోర్‌లో ఓ పోలీసు అధికారి (పక్క జిల్లాలో విధులు), ఓ వైద్యురాలి కుటుంబాలు నివాసముంటున్నాయి. విషయం తెలిసి వారు నోరెళ్లబెట్టారట.
- ఓ వ్యభిచార కేంద్రం నుంచి డబ్బు తీసుకెళ్లారనే ఆరోపణలతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను వీఆర్‌కు పంపారు. గతేడాది ఆఖర్లో వన్‌టౌన్ పోలీసులు రెండు వ్యభిచార కేంద్రాలపై దాడులు చేశారు.
- రెండు వారాల క్రితం గార్లదిన్నె మండలం తిమ్మంపేటలోని ఓ తోటలో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించారు.

మూడు నెలల క్రితం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో వరుసగా రెండు వ్యభిచార కేంద్రాలపై దాడులు చేశారు.

గుంటూరు, విజయవాడ నుంచి..

గుంతకల్లు పట్టణం అసాంఘిక కార్యకలాపాలతోపాటు అనేక వ్యవహారాలకు చీకటి రాజ్యంగా పేరొందింది. రైల్వే జంక్షన్ కీలకంగా ఉండటంతో ఇక్కడ వ్యభిచార కేంద్రాలకు నెలవుగా చేసుకున్నారు. గుంతకల్లు పట్టణానికి విజయవాడ, గుంటూరు ప్రాంతాల నుంచి యువతులను పిలిపించి వ్యభిచార కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఆలూరు రోడ్డు, దోనిముక్కల రోడ్డు, కసాపురం రోడ్డులో వ్యభిచార గృహాలు అధికంగా నిర్వహిస్తున్నట్లు సమాచారం. రైల్వేస్టేషన్ల నుంచి వచ్చే వారికి ఆటోవాలాల ద్వారా ఫొటోలు పంపుతారట. అలా ఫొటోలు సెలెక్ట్ చేసుకుని వచ్చే విటులకు వారి ద్వారానే డబ్బు వ్యవహారాలు చెప్పేస్తారట.



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి కేశవ్

ఆర్థిక ఇబ్బందులను అధిగమించి

ప్రజాసంక్షేమం

త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ అమలు

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారనీ, ఆ ఆర్థిక ఇబ్బందులన్నింటినీ అధిగమించి ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం కదిలి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సమస్యలన్నీ పరిష్కరించాలన్న ధ్యేయంతో ముందుకెళ్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లా రైతాంగాన్ని ఆదుకునేందుకు హంద్రీనీవా కాలువ వెడల్పు పనులకు రూ.3,800 కోట్లు మంజూరు చేశామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ ఇంత స్థాయిలో నిధులు మంజూరు కాలేదన్నారు. ఈ పనులను 70 రోజుల్లో పూర్తి చేసి, ప్రభుత్వం చరిత్ర సృష్టించబోతుందన్నారు. తాను మంత్రినైనా నియోజకవర్గ ప్రజలకు కూలీగానే పనిచేస్తానన్నారు. మండలంలో పలు గ్రామాలకు రోడ్ల నిర్మించేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. రెండో విడతలో అన్ని గ్రామాలకు రోడ్ల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు అమలు చేస్తామన్నారు. అనంతరం ఐసీడీఎస్ పక్షోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. కేజీబీవీ చిన్నారులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. 681 సమస్యలపై అర్జీలు వచ్చాయని ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ షర్మిల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, టీడీపీ నాయకులు పెద్దతిప్పయ్య, మల్లికార్జున, కన్వీనర్ ప్రసాద్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి

క్షేత్రస్థాయికి వెళ్లండి

- ఈ-ఆఫీస్‌లోనే నివేదికలు పంపాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



అనంతపురం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయికి వెళ్లాలని అధికారులకు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా అర్జీల పరిశీలనకు క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందేనన్నారు. అందుకు సంబంధించిన నివేదికలను ఈ-ఆఫీస్‌లో పంపాలని సూచించారు. పట్టాదారు పుస్తకానికి ఆధార్ అనుసంధానం ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, తిప్పేనాయక్, మల్లికార్జున, సర్వేశాఖ ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతులను మోసగిస్తే సహించను

- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్
- మార్కెట్ యార్డు తనిఖీ



యార్డు కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు వచ్చే రైతులను మోసం చేస్తే సహించేదీ లేదని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులను హెచ్చరించారు. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విషయం తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, పండ్లతోటల సంఘం జిల్లా అధ్యక్షుడు అనంత రాముడు తదితరులు అక్కడికి వెళ్లారు. రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కొన్ని రోజులుగా తన సిబ్బంది చేత మార్కెట్‌పై నిఘా పెట్టించానని తెలిపారు. ఐదుగురు వ్యాపారులు ఆన్‌లైన్ పేరుతో రైతులను దగా చేస్తున్నారని, బయట మార్కెట్‌లో టన్ను చీనీ రూ.50వేలు ఉండగా ఇక్కడ రూ.20 వేల నుంచి రూ.25 వేల మధ్య మాత్రమే ధర వచ్చేలా చూస్తున్నారని అన్నారు. మార్కెట్‌లో జరిగే అన్ని విషయాలపైనా నిఘా ఉంచామని అన్నారు. పండ్లతోటల రైతు సంఘం, సీపీఐ నాయకులు కూడా ఇక్కడి పరిస్థితిని తన దృష్టికి తెచ్చారని అన్నారు. మార్కెట్‌లో ఎంత మంది వ్యాపారులు దిగుబడులను కొంటున్నారని యార్డు కార్యదర్శి గోవిందును ప్రశ్నించారు. మొత్తం 42 మంది దాకా ఉన్నారని ఆయన చెప్పడంతో నెల రోజుల రికార్డులను బయటకు తీయించారు. ఐదుగురు మాత్రమే పంట కొనుగోలు చేస్తున్నారని, మిగిలిన వారు ఏమయ్యారని కార్యదర్శిని నిలదీశారు. రైతుల నుంచి 4 శాతం కమీషన్ వసూలు చేయాలని నిబంధన ఉన్నా.. 10 శాతం వసూలు చేస్తున్నారని పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై యార్డు కార్యదర్శిని ఎమ్మెల్యే నిలదీశారు. తనకు సమాచారం లేదని కార్యదర్శి అనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'యార్డులో ఏం పని చేస్తున్నారు..? గాడిదలు కాస్తున్నారా?' అని మండిపడ్డారు. ఆదాయంలో ప్రభుత్వానికి ఒకశాతం మాత్రమే అందుతుందని, మిగిలినది యార్డుకే వస్తుందని అన్నారు. నాలుగు శాతం కమీషన్ కూడా కొంతమంది దగ్గరే వసూలు చేస్తున్నారని, మిగిలిన వారితో మీరు వసూలు చేసుకుంటున్నారని, తన వద్ద పక్కా సమాచారం ఉందని అన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక నుంచి యార్డులో అక్రమాలు సాగనివ్వనని అన్నారు. గడిచిన ఐదేళ్లు కొందరు వ్యాపారులు, ఇక్కడి సిబ్బంది రైతులను దోపిడీ చేశారని మండిపడ్డారు.

పాడి రైతుకు ధీమా

పశువులు, మేకలు, గొర్రెలకు బీమా అమలు

నామమాత్రపు ప్రీమియంతో భారీ ప్రయోజనం

ఒకసారి చెల్లిస్తే మూడేళ్ల కాలానికి అమలు



6

నేడు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా పర్యటన

క్షమాపణ చెప్పు జగన్..!

- వారం రోజులే గడువు..
- లేదంటే బీసీలను ఐక్యం చేసి రాజకీయ యుద్ధం చేస్తాం
- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ఫెర్రర్ ఆశయ సాధనకు కృషి

7



ఈతాకుకు యమా డిమాండ్

అరటి పిలకల సంరక్షణకు వినియోగం

ఈత పట్ట రూ.3

ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న రైతులు

6

ఆధార్ అవస్థలు..!

కార్డులో మార్పులకు తప్పని తిప్పలు

తెల్లవారుజాము నుంచే టోకన్ల కోసం నిరీక్షణ

20వ తేదీ వరకూ బుకింగ్

ఆధార్ కేంద్రాల ఏర్పాటులో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం

ప్రధాన తపాలా కార్యాలయమే దిక్కు



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎన్ని ఆపసోపాలు పడినా... ప్రజలకు ఆధార్ కష్టాలు తీరేలా కనిపించడం లేదు. ఎక్కడికెళ్లినా... ఎవరినడిగినా.. 'అనంతపురం పెద్ద పోస్టాఫీసుకెళ్లండి... అక్కడైతేనే చేస్తారనే మాటలే వినిపిస్తున్నాయి. దీనికి కారణం... జిల్లాలో ఎక్కడా సరైన ఆధార్ సెంటర్లు లేకపోవడమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆధార్ సెంటర్లు ఉన్నా.. వాటిలో సరైన పరికరాలు లేకపోవడంతో అందరూ జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయానికి వస్తున్నారు. దీంతో ప్రధాన తపాలా కార్యాలయంలో వారం రోజులకు సరిపడా టోకన్లు ముందుగానే బుక్ అయిపోతున్నాయి. దీంతో జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు నిరాశే మిగులుతోంది. 'ఆంధ్రజ్యోతి' గురువారం నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయాన్ని పరిశీలించగా... ఒక్క రోజే 100కిపైగా టోకన్లు బుక్ అయినట్లు తెలుస్తోంది. ఈనెల 20వతేదీ వరకూ బుకింగ్ అయిపోయినట్లు అధికారులు తెలిపారు. విషయం తెలియని ప్రజలు తపాలా కార్యాలయం వద్ద టోకన్ల కోసం నిరీక్షిస్తూ కనిపించారు.



అనంతలో ఆధార్ కేంద్రాల వద్ద రద్దీ

తెల్లవారుజాము 3 గంటల నుంచి..


ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్‌లో మార్పుల కోసం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు తెల్లవారుజామున 3 గంటల నుంచి టోకన్ల కోసం నిరీక్షిస్తున్నారు. గురువారం కూడేరు మండలం నుంచి 50 మందికిపైగా ఒకేసారి ప్రధాన తపాలా కార్యాలయానికి వచ్చారు. టోకన్లు ముందే బుక్ అయ్యాయన్న విషయం తెలియక ఉదయం నుంచి పడిగాపులు కాసారు. ఆలస్యంగా చెప్పడంతో నిట్టూరుస్తూ వెనుదిరిగారు. మరికొందరు టోకన్ల కోసం క్యూలైన్లో వేచి ఉండటం కనిపించింది.

జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం

జిల్లాలో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయడంలో యంత్రాంగం విఫలమైందనే చెప్పాలి. మీ-సేవ కేంద్రాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని దాదాపు పదుల సంఖ్యలో బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాలు ఉన్నా.. ఎక్కడా సేవలు అందించడం లేదని తెలుస్తోంది. మీ-సేవ కేంద్రాల్లో ఆధార్‌లో మార్పుచేర్పులకు కొన్నింటికి మాత్రమే అనుమతులివ్వడంతో సమస్య తీవ్రమవుతున్నట్లు తెలుస్తోంది. సచివాలయాల్లో గతంలో ఆర్భాటంగా ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినా అవి ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయనే చెప్పాలి. సచివాలయాలకు కేటాయించిన ఆధార్ పరికరాలను మూలన పడేశారు. దీంతో మారుమూల గ్రామాలు, మండలకేంద్రాల్లో ఉన్న ప్రజలు ఆధార్ సేవలకు కేరాఫ్ అడ్రస్‌గా జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాల కార్యాలయం మారిపోయిందనే చెప్పాలి.

ఈ నేపథ్యంలోనే... ఉదయాన్నే జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయానికి క్యూ కడుతునానరు. టోకన్లు అయిపోవడంతో రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని కార్డుదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు సచివాలయాలు, మీ-సేవ సెంటర్లు, బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తెల్లవారుజామునే వచ్చా



ఆధార్ టోకన్ కోసం రెండ్రోజులుగా తిరుగుతున్నా. నా కుమారుడి ఆధార్‌లో మార్పుల కోసం మా ఊళ్లో మీ-సేవ సెంటర్‌కు వెళ్లా. ఎక్కడా చేయడంలేదు. అందరూ అనంతపురం వెళ్లాలని చెబుతున్నారు. తెల్లవారుజామున 3 గంటలకు వచ్చా. ఉదయం 9 గంటలకు టోకన్ ఇచ్చారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు మా ఊర్లోనే ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఈ తిప్పలు తప్పుతాయి.

-ఆంజనేయులు, నారాయణపురం

తిరిగి తిరిగి.. విసుగొచ్చింది..



నా ఆధార్ కార్డులో ఫొటో ప్రింట్ కాలేదు. కూడేరులోని మీ-సేవ సెంటర్లో అడిగితే అక్కడ అవకాశం లేదన్నారు. మా ఊరిలోని బ్యాంకుల్లో ఆధార్ సెంటర్ లేదు. తెల్లారుజామున 4 గంటలకు వచ్చా. 8 గంటలకు టోకన్ ఇచ్చారు. మా ఊర్లోనే ఆధార్ సెంటరు ఏర్పాటు చేస్తే మాకీ తిప్పలు ఉండవు కదా... ఏం ఆధారో... ఏం కథో... తిరిగి తిరిగి సొలైపోతాంది.

-శ్రీనివాస్‌రెడ్డి, కూడేరు

ఈతాకుకు యమా డిమాండ్

అరటి పిలకల సంరక్షణకు వినియోగం

ఈత పట్ట రూ.3

ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్న రైతులు



ఈత పట్టలను గతంలో కోసుకొచ్చి, ఆకులను తొలగించి కర్రలతో బుట్టలు, జల్లలు అల్లేవారు. రానురాను వాటిని అల్లేవారు కరువయ్యారు. కొనేవారూ లేరు. దీంతో ఈత పట్టలను కోసేవారు కనిపించకుండా పోయారు. అనూహ్యంగా ప్రస్తుతం వాటికి డిమాండ్ ఏర్పడింది. ఎండల నుంచి అరటి పిలకలను రక్షించుకునేందుకు రైతులు ఈత పట్టలను వినియోగిస్తున్నారు. మండలంలో ఈత చెట్లు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి రైతులు తెచ్చుకుని మరీ.. తోటల్లో వాడుతున్నారు. దీంతో వాటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒక్కో ఈత పట్ట రూ.3తో అమ్ముడుపోతోంది. ఈత పట్టల వ్యాపారం కూడా జోరందుకుంది.

-ఆంధ్రజ్యోతి, పుట్లూరు

పుట్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో అరటి పిలకలను నాటుతారు. భానుడి ప్రతాపం నుంచి వాటిని సంరక్షించుకోవడం రైతులకు పెను సవాలే. ఎలాగైనా మొక్కను రక్షించుకోవాలని వినూత్నంగా ఆలోచించిన రైతన్న అరటి పిలకలకు ఈతాకును రక్షణ కవచంగా ఉపయోగిస్తున్నాడు. దీంతో అరటి పిలకలకు ఎండ వేడిమి తగలకుండా ఈతాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. మండలవ్యాప్తంగా 2500 ఎకరాలకుపైగా ఈతాకుచాటున అరటి నాటారు. పుట్లూరు, కడవకల్లు, దోసలేడు, చెర్లోపల్లి, ఓబులాపురం, మడ్డిపల్లి, మడుగుపల్లి, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, రంగరాజుకుంట, కుమ్మనమల, చాలవేముల తదితర గ్రామాల్లో అరటి ఎక్కువగా సాగుచేస్తున్నారు. అరటి పిలకల పక్కనే ఈతాకు నాటుతున్నారు. దీంతో ఎండవేడిమి పూర్తిగా ఈతాకు మీద పడుతోంది. వెరసి అరటి పిలక ఎదుగుదలకు ఇబ్బంది లేకుండా పోతోంది. దీంతో ఏప్రిల్, మే నెలల్లో మొక్కలు నాటే రైతులు ఎక్కువగా ఈతాకుపైనే మక్కువ చూపుతున్నారు. గతంలో కాగితాలను అరటి పిలకలకు రక్షణగా ఉంచేవారు. అవి ఎండవేడిమిని పూర్తిగా నియంత్రించినప్పటికీ మొక్కలో పెరుగుదల కనిపించకపోవడంతో రైతులు ఈతాకు ఉపయోగిస్తున్నారు.



అరటి పిలకలకు ఈత ఆకును రక్షణ కవచంలా ఏర్పాటు చేసిన దృశ్యం

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

అరటికి రక్షణ కవచంగా ఉపయోగించే ఈతాకు పరిసర ప్రాంతాల్లో లేకపోవడంతో ఆత్మకూరు, ఉరవకొండ, ఆలూరు, చెన్నేకొత్తపల్లి, సనప, ఆదోని, గుత్తి తదితర ప్రాంతాల నుంచి కొందరు వ్యక్తులు ఆటోల్లో తీసుకొచ్చి, రైతులకు విక్రయిస్తున్నారు. నెలరోజుల క్రితం ఈతాకు కొమ్మ రూ.2.50 ఉండగా.. డిమాండ్ పెరగడంతో ప్రస్తుతం రూ.3తో విక్రయిస్తున్నారు. ఎకరాకు 1,300 అరటి పిలకలకు ఒక్కో దానికి ఒక్కో కొమ్మ ఏర్పాటు చేస్తున్నారు. ఈ లెక్కన ఎకరాకు రవాణా ఖర్చుతో సహా దాదాపు రూ.4వేల మేర రైతు భరించాల్సి వస్తోంది.

ఈతాకుతో లాభమే..



అరటి పిలకలకు ఈతాకు రక్షణగా ఏర్పాటు చేయడం లాభదాయకమే. ఐదెకరాల్లో అరటి నాటా. ఎకరాకు సరిపడా ఈత ఆకు కోసం రూ.4 వేలు ఖర్చు చేశా. రైతులు అందరూ ఈతాకు వాడుతుండడంతో డిమాండ్ పెరిగింది.

- రామాంజులరెడ్డి, రైతు, రంగరాజుకుంట

డిమాండ్ ఏర్పడడంతో విక్రయిస్తున్నా..



గతంలో నేను సాగుచేసిన అరటి పంటకు ఈతాకు కొనుగోలు చేశా. రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో నేనే ఇతర ప్రాంతాల నుంచి కోత కోసి, తీసుకొచ్చి విక్రయిస్తున్నా.

- సతీష్, ఎల్లుట్ల గ్రామం



ఈత పట్టలు



పెన్నహోబిలం నర్సరీలో సమస్యపై చర్చిస్తున్న డీఎఫ్ఓ విఘ్నేష్..

నర్సరీల్లో అవినీతి మొక్కలు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలు అక్రమాలకు అడ్డాగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రికార్డుల్లో మొక్కలను లక్షల్లో పంపిణీ చేసినట్లు చూపుతున్నారు. కానీ అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళితే నర్సరీల్లో మొక్కలు కనిపించవు. ఇలా మసిపూసి మారేడు కాయ చేసి నిధులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. బిల్లుల మంజూరులో కూడా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. సోషల్ ఫారెస్ట్ విభాగంలో రెగ్యులర్ డీఎఫ్ఓలు లేకపోవడం కిందిస్థాయి సిబ్బందికి వరంగా మారిందన్న ప్రచారం ఉంది.

ఒక్కరే 10.5 లక్షలు..!

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నర్సరీల్లో మొక్కల పెంపకానికి సంబంధించి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసింది. సోషల్ ఫారెస్ట్ విభాగం నుంచి ఈ ఏడాది 30 లక్షల మొక్కలు నర్సరీల్లో పెంచేలా అంచనాలు తయారు చేశారు. ఇందులో ఇప్పటికే 15 లక్షల మొక్కలు నర్సరీల్లో గ్రౌండ్ అయినట్లు అధికారులు పేర్కొన్నారు. మరో 15 లక్షల ఎత్తైన మొక్కలు వచ్చే ఏడాదికి పంపిణీ చేసేలా నర్సరీల్లో గ్రౌండ్ చేయడానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్రౌండ్ అయిన 15 లక్షల మొక్కల సంరక్షణకు సోషల్ ఫారెస్ట్‌లో జిల్లా వ్యాప్తంగా ఇద్దరు మాత్రమే సిబ్బంది ఉన్నారు. ఇందులో ఓ మహిళా సిబ్బంది ఒక్కరే 10.5 లక్షల మొక్కలు సిద్ధం చేసినట్లు రికార్డులు నమోదు చేశారు. మరో 4.5 లక్షలు మిగిలిన నర్సరీల్లో పెంచుతున్నట్లు రికార్డులు నమోదు చేశారు. అయితే క్షేత్రస్థాయిలో లేని మొక్కలను రికార్డుల్లో చూపి అందరికీ పంపిణీ చేశామని చెప్పి, నిధులు స్వాహా చేసే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కూలీల బిల్లులు స్వాహా..!

పెన్నహోబిలంలో ఉన్న నర్సరీకి సంబంధించి అక్కడ పని చేసిన కూలీలకు 2021-22 నుంచి ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు బకాయి చెల్లించాల్సి ఉంది. అయితే మంజూరైన బిల్లులను నర్సరీలు నిర్వహించే సిబ్బంది స్వాహా చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఎప్పుడు బిల్లులు మంజూరైనా కేవలం మెటీరియల్ బిల్లులు మాత్రమే పడ్డాయని చెబుతూ కూలీలకు సొమ్ము ఎగ్గొడుతున్నట్లు సమాచారం. దీంతో నర్సరీల్లో పని చేసేందుకు కూలీలు ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. ఇలా గత ఐదేళ్లుగా వచ్చిన నిధులను అక్కడి సిబ్బంది దిగమింగి తమకు ఏమి తెలియదన్నట్లు వ్యవరిస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. నాలుగు రోజుల కిందట సోషల్ ఫారెస్ట్ ఇన్‌చార్జ్ డీఎఫ్ఓ విఘ్నేష్ పెన్నహోబిలం నర్సరీని తనిఖీ చేశారు. అక్కడ మొక్కలు పెంచడానికి పాలిథిన్ కవర్లలో నింపడానికి తోలిచ్చిన మట్టి తప్ప మరో మెటీరియల్ కనిపించలేదు. గతంలో అక్కడ పని చేసిన సిబ్బంది నిర్వాకంతోనే ఇలాంటి పరిస్థితి తలెత్తిందని కూలీలు చెప్పడంతో డీఎఫ్ఓ ఖంగుతిన్నారు. డీఎఫ్ఓ విజిట్ నేపథ్యంలో అక్కడికి వెళితే తమ అక్రమాల గురించి కూలీలు బయటపెడతారనే భయంతో పలువురు సిబ్బంది ఎస్కేప్ అయినట్లు తెలిసింది.



వచ్చే సీజన్‌కు పనులు పూర్తి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్



అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): టీబీ డ్యాం నుంచి నీటి విడుదల చేసే సమయానికి హెచ్చెల్సీ కింద చేపడుతున్న పనులన్నీ పూర్తి చేస్తామని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. సుమారు రూ.50కోట్లకు పైగా నిధులతో హెచ్చెల్సీ పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలు ఇలా

ప్రశ్న: హెచ్చెల్సీ పరిధిలో ఎంత ఆయకట్టు ఉంది?

ఎస్ఈ: హెచ్చెల్సీ పరిధిలో 2,85,743ఎకరాల ఆయకట్టు ఉంది. అనంతపురం జిల్లాలోనే అత్యధికంగా 1,45,987ఎకరాల ఆయకట్టు ఉంది. కర్నూలు జిల్లాలో 14,255 ఎకరాలు, కడప జిల్లాలో 1,25,501ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రశ్న: 2024-25 సంవత్సరానికి సంబంధించి హెచ్చెల్సీకి ఎంత నీరు టీబీ డ్యాం నుంచి కేటాయించారు ?

ఎస్ఈ: టీబీ డ్యాంలో 198.50టీఎంసీల నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీ 2024-25 సంవత్సరానికి గాను 33.930టీఎంసీల నీటిని కేటాయించారు. ఏపీ బోర్డర్ 105కిలోమీటరు వద్దకు 29.626టీఎంసీల నీరు చేరింది.

ప్రశ్న: ఎంత నీటిని ఏయే వాటికి ఉపయోగించారు....?

ఎస్ఈ: జిల్లా సరిహద్దుకు చేరిన 29.626టీఎంసీల నీటిలో తాగునీటి కోసం 8.278టీఎంసీల నీటిని ఉపయోగించాం. 13.791టీఎంసీల నీటిని 90,355ఎకరాల ఆయకట్టుకు అందించాం. 33 చెరువులకు 5.04టీఎంసీల నీటిని నింపాం. ఇక 4.215టీఎంసీల నీరు రిజర్వాయర్లలో నిల్వ ఉంది.

ప్రశ్న: హెచ్చెల్సీ పరిధిలో ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి....?

ఎస్ఈ: హెచ్చెల్సీ పరిధిలో కణేకల్లు పెద్ద చెరువు, పీఏబీఆర్, ఎంపీఆర్, సుబ్బరాయసాగర్, ముచ్చుకోట రిజర్వాయర్, చాగల్లు, మైలవరం రిజర్వాయర్లు ఉన్నాయి. వీటితో పాటు మైనర్ ఇరిగేషన్ పరిధిలోని పలు చెరువులకు, ఆయకట్టుకు హెచ్చెల్సీ నీరు ఇస్తున్నాం.

ప్రశ్న: గడిచిన ఐదేళ్లలో హెచ్చెల్సీలో ఏయే పనులు చేపట్టారు...?

ఎస్ఈ: గడిచిన ఐదేళ్ల కాలంలో ఒక్క పనికూడా చేయలేదు. అనేక పనులకు నాలుగైదు దఫాలుగా ప్రభుత్వానికి, జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా...అనుమతి ఇవ్వలేదు, నిధులు ఇవ్వలేదు.

ప్రశ్న: ప్రస్తుతం ఏయే పనులు చేపడుతున్నారు?

ఎస్ఈ: ఇప్పటికే హెచ్ఎల్ఎంసీ ప్రధాన కాలవ మీద 25పనులు రూ.2.92కోట్లతో ప్రారంభించాం. మరో 11పనులు హెచ్చెల్సీ పరిధిలో రూ.37కోట్లతో త్వరలో చేపట్టాలి. మరో 183పనులకు రూ.14కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అన్ని పనులు వచ్చే నీటి విడుదల సీజన్ సమయానికి పూర్తి చేయాలనే ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం.

క్షయ నిర్మూలనకు అంకితభావంతో పనిచేయాలి

డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్

అనంతపురం టౌన్, ఏప్రిల్9(ఆంధ్ర జ్యోతి): క్షయ నిర్మూలనకు ప్రతిఒక్కరు అంకితభావంతో పనిచేయాలని డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్ సూచించారు. ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌లో బుధవారం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమజేమ్స్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో టీబీ కేసులు, నిర్ధారణ పరీక్షలు తదితర అంశాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్షయ నిర్ధారణకు ప్రత్యేక సర్వే చేశారన్నారు. అనుమానిత లక్షణాలున్న వారికి ఉచితంగా పరీక్షలు, చికిత్సలు, మందులు ఇస్తామన్నారు. ప్రజలకు ఈవ్యాధిలక్షణాల పట్ల అవగాహన కల్పించి వెంటనే వైద్యం పొందేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్‌సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రశాంత్

ఏడాదిన్నర తర్వాత..

సర్వజనాస్పత్రిలో పోస్టుల భర్తీకి అడుగులు.. దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి

అనంతపురం టౌన్, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో కాంట్రాక్టు వైద్యపోస్టుల భర్తీకి అడుగులు పడుతున్నాయి. గత వైసీపీ హయాంలో 2023 నవంబరులో మొత్తం 72 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో ఎంఆర్ఐ, ఎంఆర్ఎస్, ఓటీ టెక్నీషియన్లు, ఫిజియోథెరపిస్ట్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, స్పీచ్ థెరపిస్ట్, నెట్ అడ్మినిస్ట్రేటర్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, పెర్ఫ్యూజినిస్ట్, అటెండర్ పోస్టులు ఉన్నాయి. వీటికి అప్పట్లో 2400కిపైగా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు అందాయని వైద్యాధికారులు అంటున్నారు. ఆ తర్వాత ఆలస్యం కావడం, ఎన్నికలు రావడంతో నియామకాల ప్రక్రియ అప్పట్లో నిలిచిపోయింది. దీంతో అభ్యర్థులు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ కావడంతో ఇక అది చెల్లదని భావించి, నియామకాల గురించే మరచిపోయారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఏడాదిన్నర క్రితం ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా ఆ పోస్టులను భర్తీ చేసుకోవాలని రాష్ట్ర వైద్య శాఖాధికారులు ఆస్పత్రి వర్గాలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నాటి నోటిఫికేషన్ ఆధారంగా అటెండర్ పోస్టులు నాలుగు మినహా 68 పోస్టులను యథాతథంగా భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో గతంలో వచ్చిన నోటిఫికేషన్ల ఆధారంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనను ఇపుడు మళ్లీ మొదలు పెట్టారు. సంబంధిత సెక్షన్ ఆఫీసర్లతో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి బుధవారం దరఖాస్తులను పరిశీలించారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే పాత నోటిఫికేషన్ ప్రకారం వచ్చిన దరఖాస్తులను పక్కాగా పరిశీలించి, పారదర్శకంగా ఎంపిక ప్రక్రియ చేపట్టి అర్హులకే అవకాశం కల్పిస్తామని మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఏడాదిన్నర తర్వాత పాత నోటిఫికేషన్ ఆధారంగా పోస్టుల భర్తీకి ఆస్పత్రి అధికారులు శ్రీకారం చుట్టడంతో ఆశలు వదిలేసిన అభ్యర్థులు.. ఆనందం వ్యక్తం చేస్తున్నారు

చాంపియన్ కాకినాడ

రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ ఫైనల్లో తిరుపతిపై గెలుపు

ధర్మవరంలో జాతీయస్థాయి టోర్నీ నిర్వహణకు కృషి: మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ టోర్నీలో కాకినాడ జిల్లా జట్టు చాంపియన్‌గా అవతరించింది. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో బుధవారం నిర్వహించిన ఫైనల్లో తిరుపతి జిల్లా జట్టుతో తలపడింది. కాకినాడ జట్టు 2-0 గోల్స్ తేడాతో తిరుపతిపై ఘన విజయం సాధించి, ట్రోఫీని కైవసం చేసుకుంది. తిరుపతి రన్నరప్‌గా నిలిచింది. అన్నమయ్య జిల్లా జట్టు మూడోస్థానంతో సరిపెట్టుకుంది. బహుమతుల ప్రదానోత్సవానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. విజేత, రన్నరప్, మూడో స్థానంలో నిలిచిన జట్లకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. త్వరలో ధర్మవరంలో జాతీయస్థాయి టోర్నీ నిర్వహించేందుకు తోడ్పాటు అందిస్తానన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, రాష్ట్ర కోశాధికారి థామస్ పీటర్, జిల్లా ప్రధానకార్యదర్శి బందనాధం సూర్యప్రకాశ్, కోచ్ హుస్సేన్ పాల్గొన్నారు.



విజేత కాకినాడ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

పాడి రైతుకు ధీమా

మేలుజాతి ఆవులు



పశువులు, మేకలు, గొర్రెలకు బీమా అమలు

నామమాత్రపు ప్రీమియంతో భారీ ప్రయోజనం

ఒక్కసారి చెల్లిస్తే మూడేళ్ల కాలానికి అమలు

బొమ్మనహాళ్/రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రమాదవశాత్తు మూగజీవాలు మృత్యువాత పడితే ఆయా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడానికి గతంలో ఉన్న పశు బీమా పథకాన్ని పునఃప్రారంభించింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పశుబీమా ద్వారా ఎంతో మంది రైతులను ఆదుకున్నారు. వైసీపీ పాలనలో పథకం నిర్వీర్యమైంది. పశువులను కోల్పోయిన రైతులు బీమా రాక ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అయితే మళ్లీ పశుబీమా పథకాన్ని ప్రారంభించడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ఒక కుటుంబానికి 5 పశువుల వరకు బీమా వర్తిస్తుంది.

ప్రీమియంపై రాయితీ

బీమా ప్రీమియంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ఇస్తోంది. మూడేళ్ల కాలం ఉండే బీమాకు 85శాతం సబ్సిడీ ఇస్తోంది. రూ. 15 వేల బీమాకు ప్రీమియం రూ. 960లు చెల్లించాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వం సబ్సిడీ రూ.768 పోను రైతు వాటాగా రూ.192 చెల్లించాలి. రూ.30వేల బీమాకు ప్రీమియం రూ.1920. ప్రభుత్వ సబ్సిడీ 1536 రైతు వాటా కింద రూ.384 చెల్లించాలి. రూ.40 వేల బీమాకు ప్రీమియం 2560. సబ్సిడీ రూ.1536 పోగా రైతు వాటా రూ. 1024 చెల్లించాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకల పెంపకందారులకు ఒక కుటుంబానికి సంవత్సరానికి 50 జీవాల వరకు బీమా వర్తిస్తుంది. 6నెలలు, ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలకు రూ. 6వేల వరకూ బీమా వర్తిస్తుంది. పెంపకందారులు సంవత్సరానికి రూ.36 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. పశుపోషకులు, గొర్రెలు, మేకలు పెంపకదారులు దగ్గరలో ఉన్న పశువైద్యశాలలో బీమా చేయించుకోవచ్చు. బీమా ప్రీమియం చెల్లించిన పశువు చెవికి ట్యాగ్ వేస్తారు. పశువు చనిపోయినప్పుడు చెవి ట్యాగ్ ఆధారంగా బీమా చెల్లిస్తారు.



నిబంధనలు ఇవే..

బీమా కావాలనుకునే రైతులు బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, ఎస్సీ, ఎస్టీలైతే తెల్లరేషన్‌కార్డు జిరాక్సు కాపీలను జతపరచాలి. పశువులు మృతి చెందిన వెంటనే సమీపంలోని రైతు సేవ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. బీమా సర్వే సిబ్బంది వచ్చేవరకు పశువులకు వేసిన ట్యాగ్‌ను తొలగించకుండా ఉండాలి. బీమా చేసిన పశువులను విక్రయిస్తే ఏడురోజుల్లోగా కంపెనీ వారికి తెలియజేసి కొనుగోలుదారుడి పేరుపైన మార్చాలి. ఈ నిబంధనలపై సంబంధిత అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అవగాహన కల్పించాలి



పశులకు బీమా సౌకర్యంపై గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషకులకు అవగాహన కల్పించాలి. గతంలో రైతులు ప్రీమియం చెల్లించినా పరిహారం అందలేదు. అందుకే ఈ పథకంపై నమ్మకం లేకుండాపోయింది. అందుకే రైతులు బీమా చెల్లించేందుకు వెనుకంజ వేస్తున్నారు.

- సాంబశివరావు, పాడి రైతు, ఎల్‌బీ నగర్, బొమ్మనహాళ్ మండలం

అవగాహన కల్పిస్తున్నాం



పశుబీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి రైతు తమ పాడి పశువులకు బీమా చేసుకునేలా అవగాహన కల్పించి, ట్యాగులు వేసుకునేలా చూస్తున్నాం. ప్రభుత్వం అందించే రాయితీలు, ఉపయోగాలను తెలియజేసి సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాం.

- సూర్యనారాయణరెడ్డి, పశువైద్యాధికారి, రాయదుర్గం

ప్రతి పశువుకు బీమా చేయించండి



పశు పోషకులు ప్రతి ఒక్కరూ తమ పశువులకు బీమా చేయించాలి. పశువులు మృత్యువాత పడితే రైతు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం పశుబీమా సౌకర్యం కల్పించింది. మూడేళ్ల పాటు బీమా ఉంటుంది. ఇప్పటి వరకు మండలంలో 20 ఆవులు, 5 ఎద్దులు, 50 పొట్టేళ్లకు బీమా చేయించాం.

- వెంకటరెడ్డి, పశువైద్యాధికారి, బొమ్మనహాళ్

హత్యా రాజకీయాల పేటెంట్ జగన్‌దే

● హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి



పెనుకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): హత్య, శవ రాజకీయాల పేటెంట్ హక్కు జగన్మోహన్‌రెడ్డిదే అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి బుధవారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణను రాజకీయం చేస్తూ లబ్ధి పొందాలని చూస్తున్నాడన్నారు. సొంత చిన్నాన్ననే హత్యచేసి సానుభూతి పొంది అధికారంలోకి వచ్చిన ఘనుడు జగన్ అన్నారు. ఫ్యాక్షనిజాన్ని పూర్తిగా రూపుమాపి ప్రజాస్వామ్యవాదిగా తమ నాయకుడు చంద్రబాబు నాయుడు నిలిచాడన్నారు. పోలీసుల గుడ్డలూడదీసి నడిరోడ్డుపై నిలబెడతాననటం సమంజసమా అని ప్రశ్నించారు. గత ఐదేళ్లుగా పోలీసులను అడ్డుపెట్టుకుని రాజకీయం చేసిన నీవు ఇప్పుడు అదే పోలీసులను విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన నిన్ను, నీ పార్టీని ప్రజలు గుడ్డలూడదీసి రోడ్డుపై నిలబెట్టినా నీకు బుద్ధి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుద్ధి తెచ్చుకుని ప్రజాస్వామ్యయుతంగా నడుచుకోవాలని హితవు పలికారు.

బస్సు నుంచి జారిపడి మహిళ మృతి



ఆదిలక్ష్మమ్మ మృతదేహం

చిలమత్తూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) వేగంగా వెళుతున్న బస్సు నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. లేపాక్షి-చిలమత్తూరు రోడ్డులోని ఎర్రకొండ అటవీ నర్సరీ మలుపులో ఈ ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఆదిలక్ష్మమ్మ (55) బాగేపల్లి నుంచి హిందూపురం వెళుతున్న బాలాజీ ప్రైవేటు బస్సును చిలమత్తూరు బస్టాండులో ఎక్కింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో డోరు వద్దే నిలబడింది. బస్సు ఎర్రకొండ అటవీ నర్సరీ మలుపు వద్దకు రాగానే బస్సు ముందు డోర్ వద్ద ఉన్న ఆదిలక్ష్మమ్మ కిందకు పడిపోయింది.

వెంటనే డ్రైవర్ గమనించి బస్సును ఆపాడు. తీవ్రంగా గాయపడిన అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించారు. వారు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. దీంతో బస్సు డ్రైవర్, కండెక్టర్ పరారయ్యారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరాతీశారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు అతివేగంగా నడపడం, డోర్లు వేయకపోవడం తదితర రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతురాలు భర్త చౌడప్ప చాలాకాలం కిందటే మరణించాడు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పది మందికి ఉద్యోగోన్నతి



ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి

అనంతపురం విద్య, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ యాజమాన్యం కింద పనిచేస్తున్న 10 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించారు. బుధవారం చైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి చేతుల మీదుగా జడ్పీ ఛైర్‌పర్సన్ చాంబర్‌లో ఉత్తర్వులు అందజేశారు. జూనియర్ అసిస్టెంట్లు సుశీలాదేవి, రమాదేవి, అరుణశ్రీ, షహీనా బేగం, రవీంద్ర, మాధవి, సుబ్రహ్మణ్యం, ఉమా మహేశ్వరరెడ్డి, విశ్వనాథ్, మహేషకు ప్రమోషన్లు కల్పించారు. ఉత్తర్వులు అందిస్తూ జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, సీఈఓ రామచంద్రారెడ్డి మాట్లాడు తూ విధుల్లో జాగ్రత్తగా ఉంటూ, సంస్థకు మంచి పేరు వచ్చేలా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ ఏవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని చేనేత కార్మికుడి మృతి

ధర్మవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దయ్యగుట్ట సమీపంలో రైలు ఢీకొనడంతో ఓ చేనేత కార్మికుడు బుధవారం మృతిచెందాడు. హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు శంకర గోవిందు (62) సిద్దయ్యగుట్టలో ఉన్న తల్లిని మాట్లాడించేందుకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో మార్గమధ్యలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. దీంతో శంకర గోవిందు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి బంధువుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలికి చేరుకున్నారు. పరీక్షించి శంకరగోవిందు మృతి చెందినట్లు తెలిపారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య చౌడమ్మ, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

రేపు జోయాలుకాస్ షోరూమ్ ప్రారంభోత్సవం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ గుర్తింపు పొందిన జ్యువెలరీ సంస్థ జోయాలుకాస్ అనంతపురంలో తమ రెండో షోరూమ్‌ను ప్రారంభించనుంది. ప్రీమియం సదుపాయాలు గల ఈ షోరూమ్ ద్వారా ప్రజలకు మరిన్ని కొత్తరకాల జ్యువెలరీని అందించేందకు శ్రీకారం చుట్టనుంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అనంతపురం నగరంలోని రాజురోడ్డులో రెండో షోరూమ్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ జోయాలుకాస్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతి ఇంటికి ఉత్తమమైన డిజైన్లను అందించడమే తమ లక్ష్యమన్నారు. చరిత్రకు పేరుగాంచిన అనంతపురంలో తమ రెండో స్టోర్‌ను ప్రారంభిస్తుండటం గర్వంగా ఉందన్నారు. స్టోర్ ప్రారంభోత్సవానికి ప్రతిఒక్కరూ హాజరై, అన్నివర్గాల వారికి అనుకూలంగా తాము అందిస్తున్న ఆఫర్లు తెలుసుకోవాలన్నారు.

పకడ్బందీగా ఎన్‌డీఏ పరీక్షలు

● కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశాలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఈనెల 13న నిర్వహిస్తున్న నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నావల్‌అకాడమీ-1(2025) పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 363 మంది అభ్యర్థులు ఈపరీ క్షలు రాస్తున్నారన్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలో రెండు పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి నిర్ణీత సమయంలోగా చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లేటపుడు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదోఒక ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకొని అభ్యర్థులు రావాలన్నారు. మొబైల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించ మన్నారు. పరీక్షలకు నియమితులైన అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టరు ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, జిల్లా అదనపు ఎస్పీ ఇలియాజ్‌బాషా, డిప్యూటీ కలెక్టర్లు రామమోహన్, తిప్పేనాయక్, మల్లికార్జునరెడ్డి, మల్లికార్జునుడు, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.25 వేలు



అనంతపురం రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 25వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.5,200, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 948 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

క్షమాపణ చెప్పు జగన్..!

● వారం రోజులే గడువు..
● లేదంటే బీసీలను ఐక్యం చేసి రాజకీయ యుద్ధం చేస్తాం
● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఇతర టీడీపీ నాయకులు

అనంతపురం ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీసీ సామాజికవర్గానికి చెందిన ఎస్‌ఐ సుధాకర్ యాదవ్‌తోపాటు పోలీసు అధికారులకు మాజీ సీఎం జగన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వారం రోజుల్లో క్షమాపణలు చెప్పకపోతే బీసీలను ఐక్యం చేసి రాజకీయ యుద్ధం చేస్తామని హెచ్చరించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన లింగమయ్య కుటుంబాన్ని వైసీపీ నాయకులు ఇప్పటికీ ఆదుకునే ప్ర యత్నం చేయకపోవడం ఒక బీసీ కుటుంబాన్ని అవమానించడమే నని ఆయన మండిపడ్డారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబులతో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎంగా పనిచేశానన్న కనీస విజ్ఞత మరిచిపోయి జగన్ మాట్లాడటం దారుణమన్నారు. ఒక రెడ్డి అక్కడ ఎస్‌ఐగా పనిచేస్తూ ఉంటే అలా మాట్లాడగలవా..? అక్కడ ఒక బీసీ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు కాబట్టే ఇష్టారాజ్యంగా మాట్లాడ వని జగన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియో కాల్ ద్వారా ఎస్‌ఐ ఎమ్మెల్యే పరిటాల సునీతతో మాట్లాడించారని ఆరోపణలు చేస్తావా..? ఏ ఆధారాలు ఉన్నాయని బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎస్‌ఐపై అభాండాలు వేస్తావని నిలదీశారు. బీసీలంటే అంత చులకనా..? అని జగన్ తీరుపై మండిపడ్డారు. లింగమయ్య హత్య కేసులో నిందితులను 48 గంటలు గడవకముందే పోలీసులు అరెస్టు చేశారన్నారు. జగన్ పాలన ఉండి ఉంటే ఇది సాధ్యమయ్యేదా..? అని ప్రశ్నించారు. చట్టం ప్రకారమే పోలీసులు స్వేచ్ఛగా పనిచేశారన్నారు. టీడీపీ ఏ నాడు నేర రాజకీయాలను ప్రోత్సహించదని, నేరాలకు పాల్పడితే ఉపేక్షించదన్నారు. లింగమయ్య మరణాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని జిల్లాకు వచ్చిన జగన్‌కు ప్రతిపక్ష హోదా లేకపోయినా, మాజీ సీఎంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తే వైసీపీ కార్యకర్తలు చేసిందేమిటని నిలదీశారు. 250 మంది పోలీసు సంరక్షణలోని హెలిప్యాడ్‌లో మీ నాయకుడికి స్వేచ్ఛగా దిగే అవకాశం ఇవ్వలేదంటే వైసీపీ కార్యకర్తలు ఎంతటి సైకోలుగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చున్నారు. పోలీసుల మీద వైసీపీ కార్యకర్తలు రాళ్ల దాడి చేయడం దుర్మార్గమన్నారు. బీసీలకు క్షమాపణలు చెప్పకపోతే రాజకీయంగా ఇంకా పతనమైపోతావని జగన్‌ను హెచ్చరించారు. జగన్ చేసిన యాగీ.. రాజకీయ రాద్ధాంతం ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు ఎవరూ అంగీకరించరన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, నాయకులు వెంకటప్ప, కూచి హరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కిరాయి గూండాల్లా ...



రామగిరి మండలంలో కిరాయి గూండాల తరహాలో వైసీపీ కార్యకర్తలు వ్యవహరించారు. 1100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో ఉన్నారు. హెలీప్యాడ్ వద్ద 250 మంది పోలీసు సిబ్బంది సెక్యూరిటీ ఉన్నప్పటికీ వారిని లెక్కచేయకుండా వైసీపీ కార్యకర్తలు హెలిప్యాడ్‌లోకి దూసుకురావడం ఏమిటి? రామగిరికి వచ్చి సేఫ్‌గా తిరిగి వెళ్లావంటే పోలీసులే కారణం. ఒక మహిళ ఎస్పీగా ఉన్న జిల్లాలో పోలీసుల బట్టలు ఊడదీస్తానంటావా..? ఐదేళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి మాటలు మాట్లాడతారా..? జగన్‌కు మొదటి నుంచి శవ రాజకీయాలు చేయడం అలవాటే. ముందు మీ తల్లి, చెల్లికి న్యాయం చేసి ప్రజల్లోకి రా.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

శవం ఎక్కడ ఉంటే.. అక్కడ జగన్



శవం ఎక్కడ ఉంటే అంత అక్కడ వాలిపోవడం జగన్‌రెడ్డి శవరాజకీయాలకు నిదర్శనం నీచ, హత్యా రాజకీయాలు, నిరంకుశ పాలన చేసిన జగన్ సీఎం చంద్రబాబు పాలనపై అడ్డగోలుగా విమర్శలు చేయడం సిగ్గుచేటు. నీ పాలనలో రాష్ట్రంలో 2866కుపైగా హత్యలు జరిగాయి, ఆ కుటుంబాలన్నీ కుటుంబ పెద్దను కోల్పోయి బాధలో ఉన్నారు. ఆయా కుటుంబాలను ఎప్పుడు పరామర్శిస్తావో సమాధానం చెప్పు. జగన్ పర్యటనలో సరైన భద్రత కల్పించలేదని మాట్లాడటం హాస్యాస్పదం. పోలీసుల బట్టలు ఊడదీస్తామని మాట్లాడిన జగన్‌కు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ, అనంతపురం డీఐజీలు మహిళలనే ఇంగిత జ్ఞానం కూడా లేదు. ఇదే పోలీసులే త్వరలో నీకు, మీ పార్టీ నేతల బట్టలు ఊడదీసి, జైల్లో పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

వైసీపీ నాయకుల అరాచకం



పాపిరెడ్డిపల్లిలో జరిగిన ఘటనలో లింగమయ్య చనిపోవడం బాధాకరం. బాధిత కుటుంబాన్ని ఆదుకోవడం మానేసి, జగన్ జేజేలు కొట్టించుకోవడం ఏమిటి? హెలీప్యాడ్‌పై ఉద్దేశ్యపూర్వకంగా వైసీపీ శ్రేణులను ఉసిగొలిపి అరాచకం సృష్టించారు. వైసీపీ నాయకులంతా అరాచకం సృష్టించేవారే. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఆ పెట్టుబడులు రాకుండా చేసేందుకు కుట్రలో భాగంగానే టీడీపీపై జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తూ అరాచకాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాడు. 2024తోనే జగన్ శకం ముగిసింది. మళ్లీ అధికారంలోకి రావడం కలే. మరో పదేళ్లు సీఎంగా చంద్రబాబునాయుడే ఉంటారు.

- కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ఫెర్రర్ ఆశయ సాధనకు కృషి

● 3800 గ్రామాల్లో విన్సెంట్ ఫెర్రర్ జయంతి



హుండీలను ఓపెన్ చేస్తున్న మాంచోఫెర్రర్ తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తన తండ్రి, ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఆశయ సాధనకు మరింత కృషి చేస్తామని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ తెలిపారు. ఫాదర్‌ఫెర్రర్ 105వ జయంతి వేడుకలు బుధవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో 3800గ్రామాలలో నిర్వహించారు. స్థానిక ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ఫాదర్ విన్సెంట్‌ఫెర్రర్ ప్రత్యేకంగా చేపట్టిన ఇండియా ఫర్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 1.60లక్షలు హుండీలను మాంఛోఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్‌లు తెరిచారు. పేదలు సంపాదించి సేకరించిన మొత్తాన్ని పేద విద్యార్థుల ఉన్నత చదువులకే వినియోగించి ఫాదర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఫాదర్ చూపిన బాటలోనే నడుస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో పేదల అభ్యున్నతికి పాటుపడుతామన్నారు. అనంతరం బత్తలపల్లిలోని ఫాదర్ సమాధి వద్ద జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీసు పికెట్



పాపిరెడ్డిపల్లిలో నిర్వహిస్తున్న పోలీసు పికెట్

రామగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. మృతుడి కుటుంబాన్ని కురుబ సంఘం నాయకులు రాజహంస శ్రీనివాసులు, రిటైర్డ్ జడ్జి కిష్టప్ప తదితరులు బుధవారం పరామర్శించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు శాంతిభద్రతలపై సమీక్షిస్తున్నారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ పాపిరెడ్డిపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి శాంతిభద్రతలపై సమీక్షించారు. రామగిరి, కుంటిమద్ది తదితర గ్రామాలలో బుధవారం పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ సుమన జయంతి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు టెట్‌లో అర్హత సాధించి వారు అర్హులన్నారు. వివరాలకు ఫోన్: 08554-275575కు సంప్రదించాలన్నారు.

నేడు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా పర్యటన



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు సోములదొడ్డి సమీపంలోని నూతనంగా నిర్మించిన ఐఎంఎల్ డిపోను ఆయన ప్రారంభిస్తారు. ఆ తర్వాత 11.45 గంటలకు అనంతపురం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయానికి చేరుకొని, అక్కడి నాయకులు, కార్య కర్తలతో సమావేశమవుతారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో భోజన విరామం తీసుకుంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1.30 గంటలకు శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామానికి బయలుదేరి వెళతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అక్కడికి చేరుకొని నూతన ఐఎంఎల్ డిపో, పరిపాలన భవనాన్ని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బెంగుళూరుకు బయలుదేరి వెళతారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

అప్పుల బాధతో..

పరిగి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి(53) అప్పుల బాధతో మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపిన మేరకు శ్రీనివాసరెడ్డి గణపతిపల్లి గ్రామంలోని సోలార్ కంపెనీలో పని చేసేవాడు. ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.30లక్షల దాకా అప్పు చేశాడు. ఈక్రమంలో రుణదాతల నుంచి అప్పు చెల్లించాలని ఒత్తిడులు ఎక్కువయ్యాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రీనివాసరెడ్డి మంగళవారం రాత్రి మేడపై గదిలో ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

బెళుగుప్ప: మండలంలోని బూదివర్తిలో మంగళవారం రాత్రి ఆంజనేయులు (60) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు ఆంజనేయులు గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భార్యకు కూడా మతిస్థిమితం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గ్రామశివార్లలో వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. బుధవారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు. మృతుడికి భార్య లలితమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కుటుంబ కలహాలతో మహిళ...



భాగమతి (ఫైల్)

పుట్లూరు: మండలంలోని గాండ్లపాడు గ్రామంలో భాగమతి (32) కుటుంబ కలహాలతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటనరసింహం తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన భాగమతితో గాండ్లపాడు గ్రామానికి చెందిన రామేశ్వరరెడ్డికి ఏడేళ్ల కిందట వివాహమైంది. ఇతను గతంలో తాడిపత్రిలో ఫొటోస్టుడియోలో పనిచేసేవాడు. ప్రస్తుతం పొలం అమ్మగా వచ్చిన డబ్బుతో వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. అప్పు తీసుకున్నవారు సకాలంలో చెల్లించకపోవడంతో ఒత్తిడి తాళలేక మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. ఈ క్రమంలోనే దంపతుల మధ్య కలతలు మొదలయ్యాయి.

ఈ పరిస్థితులన్నింటితో మనస్తాపం చెందిన భాగమతి ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ సత్యబాబు, ఎస్‌ఐ వెంకటనరసింహం మృతదేహాన్ని పరిశీలించి, స్థానికులతో వివరాలు ఆరా తీశారు. మృతురాలికి రెండేళ్ల కుమారుడు ఉన్నారు. మృతురాలి సోదరి భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

15 రోజుల్లో పార్టీ పదవులు ప్రకటిస్తాం


నాయకులకు సభ్యత్వ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

- పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ అవకాశం
- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మరో పక్షం రోజుల్లో పార్టీ పదవులు ప్రకటిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. తన గెలుపు కోసం పనిచేసినా.. చేయకపోయినా... పార్టీ కోసం పనిచేసిన వారు, కేసులు ఎదుర్కొని నష్ట పోయిన వారందరికీ న్యాయం జరుగుతుందన్నారు. నగరంలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంటకశివుడు యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వహించారు. పలు డివిజన్లకు చెందిన ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి పలు రకాల సమస్యలపై అర్జీలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే పలువురు నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గతంలో 23వేలకు మించి సభ్యత్వాలు ఎప్పుడూ జరగలేదని, ఇప్పుడు 72వేలకుపైగా పార్టీ సభ్యత్వాలు నమోదు చేసి చరిత్ర సృష్టించామన్నారు. మరో పక్షం రోజుల్లో పార్టీ పదవులను ప్రకటిస్తామన్నారు. పార్టీ పదవులు ఎవరికి ఇవ్వాలనే అంశం తను ఒక్కడిపైనే ఆధారపడి ఉండదన్నారు. ఇందు కోసం 10 మందితో నియమించే ప్రత్యేక కమిటీ ఆమోదంతోనే పదవులు కేటాయిస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడినా పదవులు రానివారెవరైనా ఉంటే నేరుగా తనతో మాట్లాడవచ్చునని, వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. నామినేటెడ్ పోస్టుల్లో జిల్లాలో అత్యధికంగా అర్బన్ నియోజకవర్గానికి ఏడు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ఎవరూ ఇవ్వనన్ని బయోడేటాలు మనం పంపామన్నారు. అలాగే మరో నెల రోజుల్లో కడప జిల్లాలో తొలి సారి మహానాడు కార్యక్రమ జరగబోతోందని, ఇందులో అనంతపురం అర్బన్ నియోజకవర్గం సత్తా ఏంటో చూపించాలన్నారు.

న్యూస్ బాక్స్

చెప్పేవన్నీ శ్రీరంగ నీతులు...

- వైసీపీ నాయకుడిపై కళ్యాణదుర్గం వాల్మీకుల మండిపాటు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి నారాయణపురం వెంకటేష్ చెప్పేవన్నీ శ్రీరంగ నీతులు.. చేసేవన్నీ అవినీతి పనులని కళ్యాణదుర్గం నియోజకవర్గం వాల్మీకులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం అనంతపురం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కళ్యాణదుర్గం వాల్మీకులు బీఆర్ ఈశ్వరయ్య, రమేష్, రామాంజినేయులు, రామచంద్ర విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శెట్టూరు మండలం యాటకల్లు రామలింగేశ్వరస్వామి ఆలయం పనుల్లో వెంకటేష్ అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఈ సందర్భంగా వారు ఆరోపించారు. మాజీ ఎంపీ రంగయ్య అండ తో అధికారులతో కుమ్మక్కై, నిర్మాణ పనులు తానే చేపట్టినట్లు చూపించి, రూ.8.15 లక్షలు బిల్లులు డ్రా చేసుకున్నారన్నారు. అతడిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, పెన్నప్ప, వన్నూరప్ప, రాజు, సత్తి, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై తండ్రి దాష్టీకం

- తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఓ తండ్రి చిన్నారిపై దాష్టీకం ప్రదర్శించాడు. వైఎస్సార్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలం నందిమండలం గ్రామానికి చెందిన శివ, మౌనికలు దంపతులు కొన్నేళ్ల క్రితం అనంతపురం వచ్చారు. జేఎన్‌టీయూ సమీపంలో ఓ ప్రైవేట్ బాయ్స్ హాస్టల్‌లో వంట మనుషులుగా పనిచేస్తున్నారు. వారికి మూడేళ్ల కుమార్తె మేఘన సంతానం. ఆ చిన్నారి హాస్టల్‌లో ఎక్కడ పడితే అక్కడ మల, మూత్ర విసర్జన చేస్తుండటంతో తండ్రి శివకు కోపమొచ్చింది. మంగళవారం రాత్రి చిన్నారి అని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. గట్టిగా బుగ్గలు కొరికి, కాలితో తన్నాడు. దీంతో ఆ దెబ్బలు తాళలేక ఆ చిన్నారి గట్టిగా అరిచింది. స్థానికు లు అది వీడియో తీసి పోస్టు చేశారు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు తల్లి మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సీహెచ్‌సీకి ఫ్రిడ్జ్ వితరణ


ఫ్రిడ్జ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో మందులు, వ్యాక్సిన్‌లను భద్రపరిచేందుకు చిన్నజలాల పురానికి చెందిన టీడీపీ నాయకుడు పట్నం నగేష్ రూ. 30 వేలు విలువ చేసే ఫ్రిడ్జ్‌ను బుధవారం వితరణ చేశారు. ఎమ్మెల్యే ఆసుపత్రిని తనిఖీ చేసి ఫ్రిడ్జ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రోహినాథ్, వైద్యులు ఆంజనేయ నాయక్, ప్రవీణ్ కుమార్, పుష్పలత, రంగనాయకులు, ఎంపీడీఓ భాస్కర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి బిల్లులు చెల్లించాలి'

అనంతపురం రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆ మేరకు బుధవారం మండలంలోని సోములదొడ్డిలో సచివాలయం కార్యదర్శికి వినతి పత్రం ఇచ్చారు. గ్రామ పరిధిలోని కూలీలకు ఎనిమిది వారాల నుంచి బిల్లులు రావడం లేదన్నారు. దీంతో కూలీలు తీవ్రం ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలకు పనిముట్లు, రవాణా చార్జీలు ఇవ్వాలన్నారు. కూలీలకు అనుకూలమైన పనులు కల్పించాలన్నారు. సీఐటీయూ మండల నాయకులు పుష్పరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

నార్పల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గర్భిణులు తప్పక పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ భారతి పేర్కొన్నారు. మండలంలోని చామలూరు అంగన్‌వాడీ కేంద్రం-2లో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించండి

నార్పల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేశవరెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి వైఎల్ రామాంజినేయులు పేర్కొన్నారు. వారు బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ ఉపాధి హామీపై కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక చర్యలకు నిరసనగా ఈనెల 21, 22 తేదీల్లో నార్పల నుంచి అనంతపురం వరకు జీపుజాతా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్, సహాయ కార్యదర్శి చేపల రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

గుడి గొడవపై కేసు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ గుడి విషయంలో జరిగిన గొడవ నేపథ్యంలో రెండు వర్గాలపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మున్నానగర్‌లో చెన్నకేశవస్వామి గుడి విషయంలో ఈనెల 7వ తేదీ చిన్న ఆంజినేయులు, మోహన్‌కుమార్ వర్గీయుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈక్రమంలో గొడవ చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం పరస్పర ఫిర్యాదులపై వన్‌టౌన్ పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

శ్రీపతి లేని లోటు పూడ్చలేనిది

- జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్


నివాళులర్పిస్తున్న గేయానంద్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జేవీవీ నాయకుడు శ్రీపతి లేనిలోటు పూడ్చలేనిదని, ప్రజాసైన్స్ ఉద్యమం ఒక విలువైన కార్యకర్తను కోల్పోయిందని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. జేవీవీ జిల్లా కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సంతాపసభలో శ్రీపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు సాకే భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జేవీవీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు రంగన్న, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, జేవీవీ జిల్లా నాయకులు డాక్టర్ ప్రసూన, మహ్మద్ జిలాని, రామిరెడ్డి వీరరాజు, తిరుపాలు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పరిటాల సునీత


రాప్తాడు సమీపంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

రాప్తాడు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే టీడీపీ, పరిటాల కుటుంబం లక్ష్యమని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని హార్మోన్ సిటీ సమీపంలో రూ.2.50 కోట్లతో, కనగానపల్లి మండలం ముత్తవకుంట్లలో రూ. 3.50 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే విద్యుత్ అధికారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ఐదేళ్లలో విద్యుత్ సమస్యల వలన రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యుత్ శాఖ మంత్రితో మాట్లాడి నియోజకవర్గానికి రెండు సబ్ స్టేషన్లు మంజూరు చేయించామన్నారు. రాప్తాడు మండలం బండమీదపల్లిలోనూ త్వరలోనే మరొకటి నిర్మిస్తామన్నారు. గత ఐదేళ్లు వైసీపీ పాలకులు రైతుల సమస్యలు పట్టించు కోలేదన్నారు. ఇప్పుడు కూడా వారి పనికి మాలిన మాటలను పట్టించుకునే తీరిక, అవసరం తమకు లేదన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకానికి జవాబుదారీతనంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈలు జేవీ రమేష్, మోహనమ్మ, రాప్తాడు ఏఈ శివప్రసాద్, టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచులు సాకే తిరుపాలు, శశికళ, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, కనగానపల్లి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, మార్కెట్ యార్డు ఛైర్మన్ సుధాకర్ చౌదరి, ముకుందనాయుడు, నెట్టెం వెంకటేష్, సర్పంచ్ ఈడిగ రామాంజి, అంజి, ఎంపీటీసీ శ్రీరాములు, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

చౌకధాన్యపు డిపోలకు చేరని రేషన్

- నిల్వలు తక్కువ వచ్చాయంటూ డీలర్ల ఆందోళన

రామగిరి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో చౌకదాన్యపు డిపోలలో రేషన్‌ఇంతవరకు రాలేదు. తొమ్మిదో తేదీ వచ్చినా రేషన్ పంపిణీచేయలేదు. మండలంలో 32 రేషన్ దుకణాలుండగా ఇంతవరకు 19 షాపులకు రేషన్ బియ్యం సరఫరా కాలేదు. కారణం ఇవ్వాల్సిన కోటా కంటే బఫర్ అంటూ 5 నుంచి 15క్వింటాళ్ల వరకు తక్కువగా ఇస్తామనడంతో తాము రేషన్ ఎలా పంపిణీ చేయాలంటూ ఆ డీలర్లు నిల్వలు దించుకునేందుకు నిరాకరించారు. నిల్వలు దించుకున్న డీలర్లు లబ్ధిదారులకు కేజీ నుంచి మూడు కేజీల వరకు పట్టుకుని ఇస్తున్నారు. ఇదేమని లబ్ధిదారులు అడిగితే అక్కడి నుంచే తక్కువగా వచ్చాయని చెబుతున్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత తొమ్మిది నెలలో దాదాపు ఐదు నెలలు బఫర్ అంటూ తక్కువగా ఇచ్చారని తాము ఏవిధంగా లబ్ధిదారులకు రేషన్ అందచేయాలని డీలర్లు వాపోతున్నారు. దీనిపై సీఎస్‌డీటీ కవితను వివరణ కోరగా ఇప్పటివరకు 19 షాపులలో రేషన్‌దించలేదని బఫర్ రావడం తమ చేతుల్లో లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. నియోజకవర్గం కేంద్రంలోని రైతు మిత్ర భవనంలో బీసీ సంక్షేమ శాఖ మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ... గతంలో బడుగు బలహీన వర్గాల మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకొచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తరువాత మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి మండలంలో కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఎంపీడీఓ భాస్కర్, సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఏపీఎం ఈశ్వరయ్య, ఈఓపీఆర్డీ వెంకటలక్ష్మి, ఏఓ అన్వేష్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆదినారాయణ, టీడీపీ నాయకులు డేగల కృష్ణమూర్తి, మారుతినాయుడు, షాలిని, ఈశ్వర్‌రెడ్డి, గుర్రం లక్ష్మీనారాయణ, మాసూల చంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే శింగనమలలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ పక్షోత్సవాలకు హాజరయ్యారు. సామూహిక సీమంతాలు, అన్న ప్రాసన చేశారు.

విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళి

శింగనమలలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ నాయకులు, దివ్యాంగులు పూల మాలలు వేసి నివాలర్పించారు. అలాగే ఎమ్మెల్యే అనంతపురంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ మహిళా విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్‌తో కలసి ఫాదర్ ఫెర్రర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పసువుల శ్రీరామిరెడ్డి, జీసీ బాబు, అగజాల రాము పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ఆత్మకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఎంపీపీ హేమలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామాల్లో సమస్యలపై పలువురు సభ్యులు విరించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అన్నారు. సర్పంచ్‌లు ఎప్పటికప్పుడు నీటిసమస్యను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలని అధికారులు సర్పంచ్‌లు, ఎంపిటీసిలుకు తెలియజేశారు. సమావేశం నిర్వహించే విషయాన్ని తెలియజేయడంలో అధికారుల అలసత్వం ప్రదర్శించారని పలువురు సభ్యులు మండి పడ్డారు. మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్, ఎంపీటీసీ పారిజాతమ్మ, పి. సిద్దరాంపురం సర్పంచ్ శ్రీదేవి తదితరుల పాల్గొన్నారు.

సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు అండగా ప్రభుత్వం

- ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి


జ్యోతి ప్రజ్వల చేస్తున్న ఎంపీ, జేసీ

అనంతపురం విద్య, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలున్న(సీడబ్ల్యూఎస్ఎన్) పిల్లలకు ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక పాతూరులోని కస్తూర్బా నగరపాలక ఉన్నత పాఠశాలలో బుధవారం దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, జేసీ శివనారాయణ శర్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 244 మంది పిల్లలకు రూ. 22 లక్షల విలువైన ట్రైసైకిళ్లు, రోలేటర్లు, బ్రెయిలీ కిట్లు, హియరింగ్ ఎయిడ్స్, వీల్ ఛైర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఇతర పిల్లలతో పోలిస్తే ప్రత్యేక అవసరాలున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వారు అన్ని రంగాల్లో రాణించడానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు

ఘనంగా ఫాదర్ ఫెర్రర్ జయంతి

- ఫాదర్ ఫెర్రర్ సేవలు చిరస్మరణీయం :ఎంపీ అంబకా


ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫెర్రర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కొనియాడారు. విన్సెంట్ ఫెర్రర్ 105వ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పేదలకు విద్య, వైద్యం, కూడు, గూడు, గుడ్డ అందజేసి ప్రజల గుండెల్లో ఫెర్రర్ చిర స్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

- అనంతపురం సెంట్రల్: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఫెర్రర్ బ్లాక్‌లో బుధవారం ఫాదర్ ఫెర్రర్ నూతన విగ్రహాన్ని ఏర్పాటుచేసి, ఆవిష్కరించారు. కళాశాలకు ఆర్డీటీ వారు చేసిన సేవలకు గుర్తుగా అధ్యాపక బృందం రూ.60వేలతో ఫాదర్ ఫెర్రర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్డీటీ రామాంజనేయులు, కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ధీరేంద్రబాబు, యుగంధర్, సుంకన్న, లావణ్య, వెంకట సుబ్బయ్య, ఓంకార్, రమేష్, హర్ష, కిరణ్మయి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలోని పాదర్‌ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు డాక్టర్ అక్కులప్ప, రామాంజినేయులు, కిరణ్, ఈశ్వరయ్య, రమేష్, లక్ష్మన్న, ముత్యాలు, లింగమయ్య, అమర్నాథ్ పాల్గొన్నారు. అలాగే ఎమ్మెస్పీ, వీహెచ్ పీఎస్, ఎంఎంఎస్ ఎంజేఎఫ్ సంఘాల ప్రతినిధి డాక్టర్ స్వామాట్ మధు ఆధ్వర్యంలో ఫాదర్ ఫెర్రర్‌కు నివాళులర్పించారు. నాయకులు రేకులకుంట రామాంజినేయులు, పెద్దన్న, స్వతంత్రకుమారి, కుళ్లాయప్ప, మారుతీ, జయరాం, గగన్ తదితరులు పాల్గొన్నారు.

పెన్సిళ్లపై ఫాదర్ జీవిత చరిత్ర

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జీవితచరిత్రను పెన్సిల్ లీడ్స్‌పై చెక్కారు. ఫాదర్‌ఫెర్రర్ 105వ జయంతి సందర్భంగా బాపట్ల జిల్లా చీరాలకు చెందిన ఆటోడ్రైవర్ నరసింహారావు కుమార్తె మహిత ప్రత్యేకంగా 58 పెన్సిల్ గ్రా ఫైట్ లీడ్స్‌పై ఫాదర్ జీవితచరిత్రను చెక్కిన మెమొంటోను బుధవారం ఆర్డీ టీ ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్‌కు అందజేశారు. మహిత కళానైపుణ్యాన్ని చాటుకుందని అన్నేఫెర్రర్ అభినందించారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెన్సిళ్లపై చెక్కిన ఫాదర్ జీవితచరిత్రను అన్నె ఫెర్రర్‌కు అందజేస్తున్న మహిత

హనుమద్ వాహనంపై శ్రీరాముడు


హనుమద్‌వాహనంపై రాములవారు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం రాములవారు తన బంటు, పరమభక్తుడైన హనుమంతుడినే వాహనంగా పొంది ఊరేగారు. ఈ సందర్భంగా ఉదయం సీతా రాములకు వివిధ అభిషేకాలు, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంక రించిన రథంలో హనుమద్ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఆశీనులను చేసి, పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, జిజే వేణు, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

నగరాన్ని సమస్యల నిలయంగా మార్చారు

- ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో వైసీపీ పాలకులు అనంత నగరాన్ని సమస్యలకు నిలయంగా మా ర్చారని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డా రు. ఆయన బుధవారం స్థానిక 12వ డివిజన్‌లో మీ ఇంటికి - మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. నగర పాలక సంస్థ కమిషనర్ బాల స్వామి, టీడీపీ నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. నగరంలో ప్రధానంగా డ్రైనేజీ సమస్య కని పిస్తోందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా తగిన పరిష్కారం చూపుతామన్నారు. నగరంలో పెండింగ్‌లోని డ్రైనేజీలు, రోడ్లను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళి, బాలాంజినేయులు, బాబాఫకృద్దీన్, రంగాచారి, సరిపూటి రమణ, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

శవరాజకీయాలు చేస్తే వినాశనమే

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శింగనమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పులివెందుల శవ రాజకీ యాలు చేస్తే వినాశనం తప్పదని ఎమ్మెల్యే బండా రు శ్రావణిశ్రీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శింగనమలలో బుధవారం ఆమె మాట్లాడుతూ రామ గిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన లింగమయ్య హత్య కేసులో నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేశారని, అయితే పులివెందుల ఎమ్మెల్యే మాత్రం తన రాజకీయ ఉనికి కోసం శవరాజకీయాలు మొదలు పెట్టారని అన్నారు. నీ పాలనలో ఒక ఎమ్మెల్సీ తన కారు డ్రైవర్‌ను హత్య చేసి, డోర్ డెలివరీ చేసినప్పుడు బాధితులను పరామర్శించ బుద్ధి కాలేదా అని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న రాప్తాడు నియోజకవర్గంలో బీసీ వర్గాలను రెచ్చగొట్టి రాజకీయ డ్రా మాలు ఆడటం తగదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పోలీసులతో అడ్డమైన పనులు చేయించుకుని, ఇప్పుడు గుడ్డలూడదీస్తాం అనడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇలాగే మాట్లాడుతుంటే ఇదే పోలీసులే భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతారని మండిపడ్డారు.

'జగన్ రామగిరి పర్యటన నాటకమే'

ఆత్మకూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటన జగన్ రాజకీయ నాటకమని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు మండిపడ్డారు. మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాపిరెడ్డిపల్లి జగన్ పర్యటనను తీవ్రంగా విమర్శించారు. సీఎంగా పని చేసిన వ్యక్తి ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించడం తగదన్నారు. కులాలు, వర్గాల మధ్య కక్ష్యలు రేపేందుకు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాటలు విని జగన్ పర్యటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ వెంటనే పోలీసులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకులు శశాంక చౌదరి, మాజీ కన్వీనర్లు సూరి, వెంకటనారాయణ, కందుళ ఓబులపతి, రామదాసు, ఆనంద్ సుధాకర్ పాల్గొన్నారు.

క్రీడాకారులు, కోచ్‌లు, వాకర్ల ధర్నా

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పీటీసీ డీఎస్పీ కోటిరెడ్డి డౌన్ డౌన్ అంటూ క్రీడాకారులు, కోచ్‌లు, వాకర్లు నినదించారు. నీలం సంజీవరెడ్డి స్టేడియంలోకి తమకు అనుమతి నిరాకరించారంటూ బుధవారం సాయంత్రం సుమారు మూడు గంటల పాటు పీటీసీలో ధర్నాకు దిగారు. దీంతో కాసేపు పీటీసీ డీఎస్పీ, ఆందోళనకారుల వాగ్వాదంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గత ఆర్నెల్లుగా నీలం సంజీవరెడ్డి స్టేడియంలో క్రీడలను అనుమతించడం లేదని క్రీడాకారులు వాపోయారు. సుమారు 50ఏళ్ల చరిత్ర కలిగిన నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఓ వైపు ఆటలు, మరోవైపు వ్యాయామం, నడకతో నగరప్రజలు ఆరోగ్యం కాపాడుకుంటున్నారన్నారు. కొత్తగా వచ్చిన డీఎస్పీ కోటిరెడ్డి నీలం సంజీవరెడ్డి స్టేడియం పేరు మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అంతేగాక స్టేడియాన్ని కమర్షియల్‌గా ప్రైవేటుకు లీజుకు ఇచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడతామని హెచ్చరించారు.

ఆర్డీటీకి విరాళం అందజేత

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్‌ఫెర్రర్ జయంతి సందర్భంగా అశోక్ నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియం అసోసియేషన్ సభ్యులు విరాళం అందజేశారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్‌కు బుధవారం రూ. 22వేల చెక్కు అందజేశారు. ఏపీ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, డీఎస్ఏ ఇండోర్ స్టేడియం అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రామకృష్ణారెడ్డి, కోశాధికారి రామాంజినేయులు, కార్యదర్శి లక్ష్మీనరసప్ప, కాటమయ్య పాల్గొన్నారు.

- గార్లదిన్నె: ఫాదర్ ఫెర్రర్ సేవలు చిరస్మరణీయమని ఆర్డీటీ ఏటీఎల్ సావిత్రి పేర్కొన్నారు. గార్లదిన్నె ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ భవనంలో బుధవారం ఏటీఎల్ సావిత్రి ఆధ్వర్యంలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్పందించు... సాయం అందించు అనే కార్యక్రమం హుండీలను పలువురికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ లక్ష్మీదేవి, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



ఆస్పత్రి ప్రారంభ పూజలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్

బెళుగుప్ప, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్ వినోద్‌కుమార్, టీడీపీ నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. రూ.1.70 కోట వ్యయంతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన అల్ట్రా సౌండ్ ల్యాబ్‌ను, దళిత కాలనీలో రూ.17 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. గంగవరంలో స్వయం సహాయ సంఘాల సభ్యులు 65 మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

పేదల సంక్షేమమే ఆర్డీటీ ధ్యేయం



కళ్యాణదుర్గంలో మాంచో ఫెర్రర్‌కు చెక్కును అందిస్తున్న బద్దేనాయక్

కణేకల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ఆర్డీటీ ధ్యేయమని ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ పేర్కొన్నారు. మండలంలోని గెణిగెర గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ జయంతి సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ తండ్రి పేదల సంక్షేమాన్ని కోరుతూ దేశం విడిచి వచ్చి ఈ ప్రాంతంలో అనేక సేవలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఫెర్రర్ జయంతి

కళ్యాణదుర్గం: పట్టణంలోని ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాంఛో ఫెర్రర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాస్టారు బద్దేనాయక్ ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి పేదలకు పలు సేవలు చేస్తుండడం అభినందనీయమన్నారు. ఈ సంస్థకు ఆర్డీటీ తరఫున సహకారమందిస్తామని తెలిపా రు. అనంతరం బద్దేనాయక్ రూ.లక్ష చెక్కును మాంచో ఫెర్రర్‌కు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వాల్మీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి పయ్యావుల కేశవ్ రూ.50లక్షలు మంజూరు చేయించడంపై వాల్మీకి సంఘం నాయకులు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సంఘీభావంగా స్థానిక చెరువుకట్ట నుంచి టవర్‌క్లాక్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం వాల్మీకి మహర్షి చిత్రపటానికి, సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పా లాభిషేం చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు రేగాటి నాగరాజు, మారెన్న, జెడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, పార్టీ మండల కన్వీనర్ విజయ్ భాస్కర్, మాజీ ఎంపీపీలు ప్రతాప్‌నాయుడు, సుంకరత్నమ్మ, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల టీడీపీ ఎస్సీసెల్ నాయకులు సీఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేం చేసి కేక్‌ను కట్ చేశారు. నాయకులు కౌకుంట్ల రవి, రామకృష్ణ, వరప్రసాద్, రామాంజనేయులు పాల్గొన్నారు. కార్పెంటర్ షెడ్ నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేయడంపై కార్పెంటర్ అసోసియేషన్ అసోసియేషన్ నాయకుడు బాలాజీ, టీడీపీ నాయకుడు ప్యారంకేశవానంద సం బరాలు చేసుకున్నారు. సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేం చేశారు. యాదవ కమ్యూనిటీహాల్ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేసినందుకు ఆ సంఘం నాయకులు ఎర్రిస్వామి, అనంతయ్య, గణేష్‌బాబు మంత్రి కేశవ్‌ను కౌకుంట్లలో కలిసి శ్రీకృష్ణుడి చిత్ర పటాన్ని అందజేసి సన్మానించారు. ఇక అసంపూర్తిగా నిలిచిపోయిన షాదీఖానాకు రూ.50లక్షలు మంజూరు చేయడంపై ముస్లిం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడిపత్రి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆటోనగర్ వద్ద గత మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్న ఓబులేసు (52) బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. చిన్నపొలమడ గ్రామానికి చెందిన ఓబులేసు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయం సందర్శన

యాడికి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని పురావస్తుశాఖ ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల అసిస్టెంట్ డైరెక్టర్ రజిత బుధవారం సందర్శించారు. తొలుత ఆలయంలో స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శిథిలావస్థకు చేరుకున్న సత్రాన్ని పరిశీలించారు. తర్వాత మాట్లాడుతూ.. శిథిలావస్థకు చేరుకున్న సత్రాన్ని తొలగించి నూతన మండపం నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఆలయ ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు విన్నవించారని, ఈ మేరకు ఈ సత్రాన్ని పరిశీలించామని తెలిపారు. ఆలయ అర్చకులు, ఉత్సవాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని, తర్వాత వారి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడానికి అనుమతులిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట పురావస్తుశాఖ టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్రనాయుడు, ఇంజనీరింగ్‌అసిస్టెంట్ శ్రీనివాసులు ఉన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసగుద్దం గ్రామంలో బుధవారం ఆంజనేయస్వామి రథోత్సవం ఘనంగా జరిగిం ది. ఈ సందర్భంగా తొలుత అర్చకులు ఆలయంలో ని మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం నూతనంగా తయారు చేయించిన రథంలో ఉత్సవమూర్తిని కొలువుదీర్చి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా మూ డు రోజుల పాటు ఆలయంలో హోమాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ రథోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పాల్గొని రూ.30 వేల విరాళాన్ని ఆలయ నిర్వాహకులకు అందించారు. ఆయన వెంట మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

గుంతకల్లు, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): రాయల్టీ చెల్లించకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని పాతకొత్తచెరువు గ్రామం వద్ద ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లపై డిస్ట్రిక్ట్ మైన్స్ అండ్ జియాలజీ (కర్నూలు) శాఖ విజిలెన్స్ స్క్వాడ్ అధికారి వెంకటేశ్వర్లు దాడులు నిర్వహించారు. నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి రూరల్ పోలీసు స్టేషన్ ఆధీనంలో ఉంచారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన మొక్కజొన్న

● రెండు వందల ఎకరాల్లో పంట నష్టం



పుల్లంపల్లి వద్ద నేలకొరిగిన మొక్కజొన్న పంట

కణేకల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. దీంతో పలు గ్రామాల్లోని రెండు వందల ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్నపంట నేలకొరిగింది. అధికంగా కొత్తపల్లి, పుల్లంపల్లి, పూలచెర్ల గ్రామాల్లో పంట దెబ్బతింది. దీంతో ఆయా రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చేతికొచ్చే దశ లో ఈదురుగాలుల వల్ల మొక్కజొన్న పంట నేలకూలిందని, పెట్టిన వేలాది రూపాయలు పెట్టుబడి నష్టం జరిగిందని పుల్లంపల్లికి చెందిన వీరేష్, కొత్తపల్లికి చెందిన హనుమంతరెడ్డితో పాటు పలువురు రైతులు విలపించారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

గుంతకల్లు పట్టణాభివృద్ధికి తోడ్పడండి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రాధాన్యత కలిగిన మూడు రైల్వే వంతెనలను త్వరితగతిన నిర్మించి గుంతకల్లు పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రైల్వే అధికారులను కోరారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో బుధవారం డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ 156వ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పట్టణంలో ధర్మవరం గేటు, బళ్లారి గేటు వద్ద ఆర్‌యూబీల నిర్మించడంతో పాటు కసాపురం రోడ్డులోని ఆర్‌యూబీని వెడల్పు చేయాలని చేయాల అన్నారు. అలాగే రైల్వే పరిధిలోని కొన్ని రహదారులను మూసేసిన కారణంగా పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారని, కావున వెంటనే అడ్డంకులను తొలగించాలని కోరారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ముద్దనూరు-ముదిగుబ్బ మధ్య లైన్‌ను నిర్మిస్తే ప్రయాణికులకు, సరుకు రవాణా కు అనువుగా ఉంటుందన్నారు. రైల్వే కోడూరులో కొన్ని రైళ్లను ఆపాలని, కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, రాజధాని ఎక్స్‌ప్రెస్‌లకు ఏసీ వ్యాగన్లను బిగించి వ్యవసాయోత్పత్తుల రవాణాకు తోడ్పడాలని కోరారు. సీనియర్ డీసీఎం మనోజ్, డీఆర్‌యూసీసీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించడం హాస్యాస్పదం..

గుంతకల్లు: వైసీపీ అధినేత వైఎస్ జగన్ రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో సీఎం చంద్రబాబుపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇతర కారణాలతో పార్టీ కార్యకర్త మృతి చెందితే.. అందుకు టీడీపీ కారణమని చెప్పడం హాస్యాస్పదమన్నారు. వివాద రహితుడైన చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నం చేయడం మానుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ

గుంతకల్లు: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలకు పార్టీ సభ్యత్వ గుర్తింపు కార్డుల పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే పాల్గొని తొలుత రూ. లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాలను పొందిన బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందుకు సభ్యత్వ గుర్తింపు కార్డులను అందజేశారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి: సీపీఎం



గుంతకల్లులో కట్టెలపొయ్యి మీద వంట చేస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను తక్షణమే తగ్గించాలని పట్టణంలోని సీపీఎం, ఐద్వామహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద బుధవారం కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ, ఖాళీ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న ప్రజలపై తాజాగా గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంచి మరింత భారం మోపడం సరైంది కాదన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా కేంద్రప్రభుత్వం గ్యాస్ ధరను పెంచడం దుర్మారమన్నారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి గ్యాస్ ధరను తగ్గించేలా చూడాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతి, రంగమ్మ, సీపీఎం నాయకులు సాకే నాగరాజు, సురేంద్ర, రామునాయక్, చంద్రశేఖర్, అబ్దుల్లా, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

● ఉరవకొండ: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. నాయకులు మధుసూదన్, సిద్ధప్ప,మురళి, వీరాంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

● గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద రోడ్డుపై సీపీఎం నాయకులు ఖాళీ సిలిండర్లతో నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి నిర్మల, నాయకులు అశోక్, మహాలక్ష్మి, మహిళ సంఘం నాయకురాలు రేణుకా, రేవతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

రాయదుర్గం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిరంజీవిరెడ్డి సూచించారు. పట్టణంలోని హరకేశ్వరస్వామి కళ్యాణమంటపంలో బుధవారం నియోజకవర్గ కన్వీనర్ హీ రోజీరావు అధ్యక్షతన క్రియాశీలక సభ్యులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడానికి కృషి చేయాలన్నారు. అందరు సమష్టిగా పని చేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధరాదేవి, నాయకుడు కాపు రామచంద్రారెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ మలార్కార్ శంకర్, పట్టణ సీనియర్ నాయకుడు అంబోజీరావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై అసత్య ఆరోపణలు తగవు

కళ్యాణదుర్గం రూరల్: వక్ఫ్ సవరణ బిల్లుపై ప్రతిపక్షపార్టీలు అసత్య ఆరోపణలు చేయడం తగదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో ఆయన అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష పార్టీలు ఇటువంటి ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి తలారి సోము, పట్టణ అధ్యక్షుడు సునీల్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేయండి

ఉరవకొండ: క్షేత్రస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వీరశైవ కల్యాణమండపంలో ఆయన నియోజకవర్గ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి ఈ మేరకు మాట్లాడారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి లక్ష్మీనారాయణరెడ్డి, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పరిహారం మంజూరుపై రైతుల హర్షం

కణేకల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం, సొల్లాపురం, హనుమాపురం తదితర గ్రామాలలో హంద్రీనీవా కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇటీవల ప్రభుత్వం రూ.8కోట్ల పరిహారాన్ని మంజూరు చేసింది. దీంతో ఆయా రైతులు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాయదుర్గం పట్టణంలో బుధవారం ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు వేలూరు మరియప్ప, హనుమాపురం సర్పంచ్ జయరాంచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల నిరసన

తాడిపత్రి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పట్టణంలోని సిద్ధిబాషాదర్గా సమీపంలో బుధవారం ముస్లింలు రిలేనిరాహార దీక్ష చేపట్టారు. పలువురు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారికి వివిధ సంఘాలు, పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. మతపెద్దలు హయత్ సాహెబ్, మున్నా, అయూబ్, జాకీర్, గోరా, రహీం, మహమ్మద్, సుభాన్, దాదా తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశం..

గుత్తి: పట్టణంలోని నిజామి ఫంక్షన్ హాల్లో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ నాయకులు రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ప్రతి ముస్లిం ఉద్యమించాలన్నారు. ఈ క్రమంలో ఆదివారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిరసన చేపట్టనున్నట్లు చెప్పారు. నాయకులు ఇస్మాయిల్, మైనుద్దీన్, నజీర్, దస్తగిరి, ప్రభుత్వ ఖాజీ ఖత్బిసా, తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

శెట్టూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించి కూలీల సంఖ్యను పెంచి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఏపీడీ రమేష్ నాయక్ సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సమష్టిగా పనిచేసి ఉపాధి కూలీలు పనులకు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈసీ వెంకటరమణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

డీలర్ల సంఘం కమిటీ ఎన్నిక

శెట్టూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల మండల నూతన కమిటీని బుధవారం మండలకేంద్రంలో డీలర్లందరూ కలిసి ఎన్నిక చేశారు. అధ్యక్షుడిగా ఖైరేవు డీలర్ విరుపాక్షి, ఉపాధ్యక్షుడిగా లక్ష్మంపల్లి వీరభద్రను ఎన్నికున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు.

72బీరు బాటిళ్ల స్వాధీనం

తాడిపత్రి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): యల్లనూరు మండలం గొడ్డుమర్రి క్రాస్ వద్ద అక్రమంగా తరలుతున్న 72 బీరు బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు మంగళవారం రాత్రి పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా శింగవరం గ్రామం వైపు నుంచి వచ్చిన కారులో ఆరుకేసులు బీర్లు గుర్తించి సీజ్‌చేశారు. అనంతరం బుధవారం తాడిపత్రి ఎక్సైజ్ కార్యాలయంలో వారు వాటి వివరాలు వెల్లడించారు. 72కింగ్‌ఫిషర్ బీర్లు ఉన్నట్లు గుర్తించి కారుతోపాటు స్వాధీనం చేసుకున్నామని, తరలిస్తున్న ఆనంద్‌రెడ్డి అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అతన్ని కడపజిల్లా లింగాల మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యల్లనూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లి గ్రామ శివారులోగల పేకాటస్థావరంపై బుధవారం దాడులు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయ రెడ్డి తెలిపారు. అక్కడ పేకాటాడుతున్న 8మందిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.57వేలు నగదు, 7 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడులు చేశామని అన్నారు. అరెస్టయిన వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

విన్సెంట్ ఫెర్రర్‌కు ఘన నివాళి

● ఘనంగా 105వ జయంతి వేడుకలు



కుందుర్పిలో ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విశాలాఫెర్రర్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 105వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కల్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని అన్ని పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామాల్లో సైతం ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్‌లు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. విదేశీయుడైన ఫాదర్ ఫెర్రర్ కరువు ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీని స్థాపించి పేదలకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. విద్య, వైద్యం, వ్యవసాయంతో పాటు అనేక రంగాల్లో పేదలకు సేవలందించారని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీటీ సిబ్బంది, అన్ని సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛందసంస్థల నిర్వాహకులు, దివ్యాంగులు, విద్యార్థులు, గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కుందుర్పి మండల కేంద్రంలోని ఫాదర్ ఫెర్రర్ ఆలయంలో నిర్వహించిన జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్ హాజరయ్యారు. అక్కడి ఫెర్రర్ నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే యాడికి మండలకేంద్రంలో ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి స్పెయిన్ దేశస్థులు మరియా, బ్లాంకా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



యాడికిలో స్పెయిన్ దేశస్థుల నివాళి



బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో విద్యార్థుల నివాళి..



చోళసముద్రంలో సర్పంచ్ వడ్డే రమాదేవి..

నెట్టికంటి సన్నిధిలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి బుధవారం సందర్శించారు. అర్చకులు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికి స్వామిదర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు మునుపు ఆయన గుంతకల్లు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ నివాసానికి వెళ్లారు. అక్కడ జితేంద్రగౌడ్ శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పవన్‌కుమార్‌గౌడ్, యువనేత ప్రవీణ్‌గౌడ్, పార్లమెంట్ బీసీ సెల్‌ఉపాధ్యక్షుడు కేశప్ప తదితరులు పాల్గొన్నారు.

నెమలి వాహనంపై సంగమేశ్వరుడు

కూడేరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో జోడులింగాల సంగమేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామివారు నెమలి వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు ఆలయంలో జోడులింగాలకు రుద్రాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిపారు. అనంతరం రాత్రి సంగమ్మ, సంగప్పల ఉత్సవమూర్తులను నెమలివాహనంలో ఉంచి గ్రామపుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బాల్యవివాహ యత్నాన్ని అడ్డుకున్న అధికారులు

యాడికి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో బాల్యవివాహ యత్నాన్ని బుధవారం అధికారులు అడ్డుకున్నారు. రాయలచెరువు గ్రామానికి చెందిన ఒక బాలిక ఇటీవలే 10వ తరగతి పరీక్షలు రాసింది. అయితే ఆమెకు యల్లనూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువకుడితో వివాహం నిశ్చయమైంది. ఈ క్రమంలో బుధవారం నిశ్చితార్థానికి ఏర్పాట్లు చేసుకుంటుండగా.. సమాచారం అందుకున్న మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ఆ బాలిక ఇంటివద్దకు వెళ్లి అడ్డుకున్నారు. బాల్య వివాహం చేయకూడదని సర్దిచెప్పారు. అనంతరం బాలిక తల్లిదండ్రులతో పాటు యువకుడి తల్లిదండ్రులను గ్రామపంచాయతీ కార్యాలయానికి రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు బాల్యవివాహం చేయమని అధికారులకు అంగీకారపత్రాన్ని అందజేశారు. బాల్యవివాహ నిర్మూలనలో ఐసీడీఎస్ రాయలచెరువు సెక్టార్ సూపర్‌వైజర్ శంషాద్‌బేగం, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, ఏఎస్ఐ వెంకటేష్, సచివాలయ మహిళా పోలీసు రమాదేవి కృషిని పలువురు అభినందించారు.

బకాయి వేతనాలు ఇవ్వాలని వినతి

కణేకల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తమకు బకాయిపడ్డ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు బుధవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు, శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి రాము మాట్లాడుతూ తాము 14 ఏళ్లుగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్నామన్నారు. ఆరునెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇలా అయితే తాము కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రేపు మాపు అంటూ కాలయాపన చేస్తున్నారే కానీ జీతాలు ఇవ్వలేదని వాపోయారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. సంఘం నాయకులు శివకుమార్, ప్రకాష్, సంజీవప్ప, రాజశేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధనగ్న ప్రదర్శన ..

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని పంపుహౌస్ వద్ద శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు నాలుగోరోజైన బుధవారమూ నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని సకాలంలో జీతాలు, ఈపీఎఫ్ చెల్లించాలని కోరారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వారంరోజుల్లో వైద్య పోస్టుల భర్తీ: డీసీహెచ్‌ఎస్

రాయదుర్గం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వారంరోజుల్లో భర్తీ చేస్తామని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్‌రవికుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వార్డులలో తిరిగి రోగులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఇక్కడి ఆస్పత్రిలో వైద్యులు లేరనే విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాన్ని సీరియస్‌గా పరిగణించామన్నారు. డైరెక్టర్ స్థాయిలో దీనిపై సమీక్షించి రాయదుర్గం వైద్యశాలకు వెంటనే వైద్యులను నియమించే ప్రక్రియను మొదలుపెట్టామన్నారు. వారంలో రాయదుర్గం ప్రాంతంలో డాక్టర్ల పోస్టులన్నీ భర్తీ చేస్తామని అన్నారు. ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ జ్ఞానసుధ తదితరులు ఉన్నారు.

గొర్రెపిల్లలను ఎత్తుకెళ్లిన చిరుత

ఉరవకొండ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం పీసీ ప్యాపిలి గ్రామ సమీపంలో చంద్రన్న అనే రైతుకు చెందిన ఆరు గొర్రె పిల్లలను చిరుతపులి ఎత్తుకెళ్లిందని గ్రామస్థులు బుధవారం తెలిపారు. వ్యవసాయపొలాలకు వెళ్లే సమయంలో చిరుతను చూసినట్లు పలువురు చెప్పారు. చిరుత సంచరిస్తుండటంతో పొలాలకు వెళ్లలేకపోతున్నామన్నారు. అటవీ అధికారులు స్పందించి చిరుతపులిని బందించి దూరంగా అడవిలో వదలాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వన్నేదొడ్డికి చెందిన రంగారెడ్డి బైక్‌లో గుత్తికి వస్తుండగా కొత్తపేట శివారులో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాయదుర్గం డిపో అభివృద్ధికి కృషి చేస్తా



గ్యారేజీ షెడ్డును పరిశీలిస్తున్న పూల నాగరాజు

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం ఆర్టీసీ డిపో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. రాయదుర్గం డిపోను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ డిపోలో బస్సుల కొరత ఉందని, కొత్త బస్సులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. వచ్చే ఏడాది బడ్జెట్‌లో నిధులు కేటాయించి హైటెక్ బస్సు స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాయదుర్గం ఆర్టీసీ డిపో శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపడతామన్నారు. బస్టాండ్ ఆవరణలో సీసీరోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కార్మికులతో సమస్యలన్నీ అడిగి తెలుసుకున్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఈఈ సురేంద్రబాబు, డీఎం శ్రీనివాసులు, ఆర్టీసీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకో జగన్..

రాయదుర్గంరూరల్: మాజీ సీఎం జగన్ పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని పూల నాగరాజు పేర్కొన్నారు. ఆర్టీసీ డిపోలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఇటీవల హత్యకు గురైన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చిన జగన్ ప్రభుత్వ పెద్దలను, పోలీసులను ఇష్టానుసారంగా మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ హయాంలో పోలీసులు, సొంత మనుషులతో హత్యా రాజకీయాలకు పాల్పడి నీవు.. ఇప్పుడు నీతులు మాట్లాడడం సరికాదన్నారు. సీఎంచంద్రబాబుపై విమర్శలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.